J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 43 సంచిక : 15 15.9.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి




## స్కిల్ స్కామ్ నేరం

# నారాకి కారాగారం

## జైలుకెళ్లిన తెలుగు రాష్ట్రాల తొలి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు!

### 'బుల్లెట్టు దిగిందంటున్న' రాజకీయ వర్గాలు

### 'జగన్ మగాడ్రా బుజ్జీ' అంటున్న వైసీపీ శ్రేణులు

### బావ కుర్చీలో కూర్చున్న బాలయ్య

### టీడీపీ - జేఎస్‌పీ కలిసి పోటీ చేస్తాయని ప్రకటించిన పవన్

### మారుతున్న రాజకీయ సమీకరణలు - నేతల ఢిల్లీ ప్రయాణాలు




**తాను అధికారంలోకి వచ్చిన 4 సంవత్సరాల 3 నెలలా 11 రోజులకి ఆంధ్రా ముఖ్యమంత్రి, రాజశేఖరరెడ్డి వారసుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తన పంతాన్ని నెగ్గించుకున్నారు. తనపై 'ఆర్థిక నేరస్తుడు' అని ముద్ర పడడానికి రాజకీయ కుయుక్తులతో పావులు కదిపి తెరవెనుక సూత్రధారుడిగా ఉండిన నారా చంద్రబాబునాయుడి పైన కూడా ఆర్థిక నేరస్తుడు అన్న ముద్ర వేసేశారు. అంతే కాకుండా బాబుని కూడా కటకటాల వెనుకకు పంపించి, జగన్‌ని మాట కొస్తే 'నువ్వు జైలుకెళ్ళొచ్చావు' అంటూ తమ ఉపన్యాసాలలో ఊదరగొట్టే నారా & కో నోర్లు మూయించారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఇదొక సంచలనాత్మక సంఘటన.**

ఆయన తొమ్మిదిన్నర సంవత్సరాలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కి, అయిదు సంవత్సరాలు విభజన ఆంధ్రకి ముఖ్యమంత్రి. అంటే పధ్నాలుగున్నర సంవత్సరాలు అధికారంలో ఉండి సి.ఎం కుర్చీలో కూర్చున్న వ్యక్తి. అలాంటివాడిని ముప్పుతిప్పలుపెట్టి, మూడు చెరువుల నీళ్లు తాగించారు. 48 గంటలు జాగారం చేయించి రాజమండ్రి కేంద్ర కారాగారంలో వేశారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల రాజకీయ చరిత్రలో అవినీతి ఆరోపణలతో ఒక మాజీ ముఖ్యమంత్రి జైలుకి వెళ్లడం ఇదే తొలిసారి. అలా చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కింది. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో 371 కోట్ల స్కామ్ జరిగిందని, అందులో 241 కోట్లు షెల్ కంపెనీల ద్వారా బాబు ఖాతాలోకి చేరాయన్నది సిఐడి ఆరోపణ. సదరు కుంభకోణం కేసులో 38 మందిని ఛార్జిషీట్‌లో చేరిస్తే, అందులో ఏ1గా చంద్రబాబు పేరును పెట్టారు. సెప్టెంబర్ 9వతేది ఉదయం నంద్యాలలో చంద్రబాబుని అరెస్టు చేసిన దగ్గర నుండి 10తేదీ సాయంత్రం 6 గంటలా 45 నిముషాలకి

10లో



# రెడ్‌క్రాస్‌లో ఫిజియోథెరపీ దినోత్సవం



అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా నెల్లూరులోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల ఎంఎస్ఆర్ స్పాస్టిక్ సెంటర్‌కి చెందిన ఫిజియోథెరపిస్టులు డాక్టర్ వాసు, డాక్టర్ నవీన్, డాక్టర్ నవీద్ అక్తర్‌లను సన్మానించారు. స్పాస్టిక్ సెంటర్ కన్వీనర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు ఎంవి సుబ్బారెడ్డి, మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ గురునాథరావు తదితరులు పాల్గొని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా, సమాజానికి మరింత ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించాలనే సంకల్పంతో పలువురు ఫిజియోథెరపిస్టులు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. ప్రథమ చికిత్సలో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు సీహెచ్ చంద్రశేఖర్‌రావు, కో-ఆర్డినేటర్ జివి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉత్తమంగా రాణించాలి

## విఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి



విద్యార్థులు ఉత్తమ వ్యక్తిత్వంతో సమాజంలో ఉత్తమంగా రాణించాలని విఎస్‌యు వీసీ ఆచార్య జిఎం సుందరవల్లి చెప్పారు. ఈనెల 12న నెల్లూరు పురమందిరంలో నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 501 మంది విద్యార్థులకు రూ. 9.18 లక్షల నగదు పురస్కారాలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఇంటర్నేషనల్ హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగపట్నం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తన సొంత నిధులను విద్యార్థుల అభ్యున్నతికోసం వినియోగిస్తున్న సుబ్రహ్మణ్యాన్ని ఆమె ఈ సందర్భంగా అభినందించారు. డిఇఓ గంగాభవాని, ప్రముఖ కార్డియాలజిస్ట్ శ్రీనివాసరాజు, డాక్టర్లు గంగపట్నం సుధ, పెనుగొండ రవిశంకర్, హెడ్మాస్టర్ తిరుమలరాజు, ఏపిజిఇఎఫ్ జిల్లా ఛైర్మెన్ సుధాకర్‌రావు, కల్పం రమేష్, అమరలింగం, నలుబోలు బలరామయ్య నాయుడు, మోహన్‌రెడ్డి, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.

## వరసిద్ధి వినాయకునికి

# కుంభాభిషేకం

నెల్లూరు గాంధీబొమ్మ కూడలిలోని శివాజీసెంటర్‌లో ఉన్న శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయం వార్షిక కుంభాభిషేకం ఈనెల 12న వేడుకగా జరిగింది. ఆలయ అర్చకుడు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత నవకలశాభిషేకాలు, గణపతి హోమం, పూర్ణాహుతి, మహాకుంభప్రోక్షణ తదితర పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు సుబ్రహ్మణ్యం, రంగరాజన్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడలో

# నిత్యాన్నదానానికి విరాళం

జొన్నవాడ కామాక్షమ్మ దేవాలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన దాతలు దుష్యంత్ రెడ్డి-మేఘన దంపతులు, వారి కుమారుడు సాకేత్‌రెడ్డి కలసి ఈనెల 10న 13,500 రూపాయలు విరాళంగా ఆలయ నిర్వాహకులకు అందజేశారు.


## పేద విద్యార్థికి

# 'బెస్ట్ ఫ్రండ్స్' సాయం

బుచ్చిరెడ్డిపాళెం గిరిజనకాలనీకి చెందిన పేదవిద్యార్థి పవన్ చదువుకునేందుకు ఫీజులు వగైరాలకు నెల్లూరుకు చెందిన బెస్ట్ ఫ్రండ్స్ అసోసియేషన్ నిర్వాహకులు ఈనెల 12న 10వేల రూపాయలు సాయంగా అందజేశారు. అసోసియేషన్ ప్రతినిధులు కరంతుల్లాబాషా, బాలకేశవులు, డాక్టర్ సీవీ రమణ, మహబూబ్ బాషా, స్థానిక గోపాలకృష్ణయ్య స్కూల్ కరెస్పాండెంట్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# సొంతింటికి నెల్లూరు నగర మేయర్

## వైసిపికి తిరిగొచ్చేసిన పొట్లూరి స్రవంతి



నెల్లూరు రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డితో పాటు పార్టీని వీడి వెళ్లిపోయిన నెల్లూరు నగర కార్పొరేషన్ మేయర్ పొట్లూరి స్రవంతి తిరిగి సొంతింటికి వచ్చేశారు. గురువారం నాడు పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి నివాసంలో నెల్లూరు పార్లమెంటు సభ్యులు, రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో తన భర్త జయవర్ధన్‌తో కలిసి స్రవంతి పార్టీలోకి పునఃప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు ఎంపీలను స్రవంతి దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ స్రవంతి దంపతులకి, పార్టీ పెద్దలకీ మధ్య సంధానకర్తగా వ్యవహరించినట్లున్నాడు. మొత్తానికి చంద్రబాబు అరెస్టుతో మేయర్ దంపతులు బెంబేలెత్తినట్లు ఉన్నారు. ఎందుకొచ్చిన కర్మ అని వైసిపికి తిరిగొచ్చారని పార్టీ వర్గాలు గుసగుసలాడుకుంటున్నాయి.

# మాండలికాలపై 'అరసం' ఇష్టాగోష్టి

ప్రజాకవి కాళోజీ జయంతిని తెలుగు మాండలిక భాషా దినోత్సవంగా జరుపుకుంటూ ఇటీవల నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయంలో జిల్లా అరసం (అభ్యుదయ రచయితల సంఘం) శాఖ ఆధ్వర్యంలో ఇష్టాగోష్టి జరిగింది. పలువురు సాహితీవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అరసం జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య మాట్లాడుతూ, మాండలిక భాష అంటే ఒక మండలంలో మాట్లాడేభాష అని చెప్పుకోవచ్చనీ, మాండలికభాషల్లో నెల్లూరు యాస-భాష విలక్షణమైనవని అన్నారు. 'నీ పాసుగోల', 'బిన్నా రా', 'ఏందబయ్యా' లాంటి మన మాండలిక పదాలను మనం క్రమేణా కోల్పోతున్నామని, మన భాష-యాసలను పరిరక్షించుకోవాలని చెప్పారు. మాండలిక భాష ప్రాముఖ్యతను అందరూ గుర్తించాలని, బాలసాహిత్యంలో కూడా మాండలిక భాషను ఇటీవల కొందరు రచయితలు ఉపయోగిస్తుండడం శుభసూచకమని అరసం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ అన్నారు. అరసం రాష్ట్ర కార్యవర్గసభ్యులు పెరుగు రామకృష్ణ, విశ్రాంత గ్రంథాలయ అధికారి సుభాష్, అరసం జిల్లా కార్యదర్శి అవ్వారు శ్రీధరబాబు, రచయిత గుండాల నరేంద్రబాబు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.




శుభప్రారంభం

గత రెండు దశాబ్దాలుగా దక్షిణ ఆంధ్ర ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న

ప్రముఖ కంటి వైద్య శస్త్ర చికిత్సా నిపుణులు డాక్టర్ ఓ. గోపాలకృష్ణ గారి

నూతన కంటి వైద్యశాల సొంత నూతన భవంతిలో ప్రారంభం

తేది: 17-09-2023 ఆదివారం, ఉదయం 10-00 గంటలకు

ARKA EYE HOSPITAL

Darkness to Light....

16-2-102/1, Complex, Railway Track Road, Pogathota,

Nellore-524001. Cell: 98492 21738, 81799 98916

మా ఆత్మీయులందరికీ ఇదే మా హృదయపూర్వక ఆహ్వానము...

గౌరవ అతిథులు

డా॥ యస్.సి. సుబ్రమణ్యం గారు

డా॥ శివప్రతాప్‌రెడ్డి గారు

డా॥ టి.వై.క్రిష్ణ గారు

డా॥ జె.కె.రెడ్డి గారు

డా॥ పి.నరసింహారావు గారు

డా॥ మంజులమ్మ గారు

డా॥ బి.కృష్ణమూర్తి గారు

డా॥ కె.సుధాకర్‌రెడ్డి గారు

డా॥ ఓ. గోపాలకృష్ణ

M.S., FACS (USA)

శ్రీమతి అంజని

ఓ. అనిరుధ్ కృష్ణ

వాస్తు సతీష్ చంద్ర





జననం : 1931 నిర్యాణం : 2023

**శ్రీమతి పాలిచర్ల శారదమ్మ గారు**



జననం : 1956 నిర్యాణం : 2023

**శ్రీ పాలిచర్ల శ్రీనివాసులురెడ్డి గారు**

# అశృనివాళి

నా అభివృద్ధికి ఆసరా కల్పించిన
నా శ్రేయోభిలాషి
**పి.వి.ప్రసన్నరెడ్డి** గారి
అమ్మ గారు,
ప్రేమానురాగాలు మూర్తీభవించిన
అనురాగ దేవత...
పాలిచర్ల వారి కుటుంబ కీర్తికి
స్ఫూర్తిప్రదాత...

**శ్రీమతి పాలిచర్ల శారదమ్మ గారు**

**పి.వి.ప్రసన్నరెడ్డి** గారి తమ్ముడు,
స్నేహాభిలాషులు,
సేవాపరాయణులు,
మానేగుంటపాడు
అభివృద్ధి ప్రదాతలు

**శ్రీ పాలిచర్ల శ్రీనివాసులురెడ్డి గారల**

ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...
ప్రసన్నరెడ్డి గారికి,
వారి కుటుంబసభ్యులకి
మనోస్థైర్యాన్ని ప్రసాదించాలని
భగవంతుని ప్రార్థిస్తూ...
**కన్నీటి నయనాలతో...**

**ప్రత్తి శ్రీనివాసులు**
(లేట్ ప్రత్తి సూరి కుమారుడు)
**రవీంద్రనాథ్ ఠాగూర్ ఆడిటోరియం**
శ్రీ కస్తూరిదేవి విద్యాలయ ప్రాంగణం
నెల్లూరు. సెల్ : 9347102503.

లాయర్
సెప్టెంబర్ 15, 2023

# సమైక్యతా స్ఫూర్తి!.. మెరిసిన భారత కీర్తి!

*సకల మానవాళి సంపూర్ణ వికాసానికి, విశ్వశాంతికే భారత్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అన్నదే ప్రపంచానికి వెలుగుబాటలు చూపే తారకమంత్రం.*

- భారత ప్రధాని మోడీ

*వాతావరణ మార్పులు, సంక్షోభాలతో ప్రపంచ ఆర్థికవ్యవస్థ సతమతమవుతున్న నేపథ్యంలో అనేక సమస్యలకు జీ20 పరిష్కారం చూపగలదని ఢిల్లీ సదస్సు నిరూపించింది.*

- అమెరికా అధ్యక్షుడు జోబైడెన్

ఉక్రెయిన్‌పై అమానుషదాడులకు పాల్పడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న రష్యా, తన దుందుడుకు విధానాలతో భారత్‌పై గుర్రుగా చూస్తున్న చైనా..మరోవైపు పొంచివున్న ఉగ్రవాదం, ఇంకోవైపు ఎంతకీ తీరని ఆకలి, పేదరికం, పర్యావరణ సమస్యలు ప్రపంచాన్ని అల్లకల్లోలం చేస్తున్న నేపథ్యంలో భారత్ అధ్యక్షత్వం కింద ఢిల్లీలో ఇటీవల భారీఎత్తున నిర్వహించిన జీ20 దేశాల శిఖరాగ్ర సదస్సు ఆద్యంతం అద్భుతంగా సాగి అనేకదేశాల నేతలను బాగా ప్రభావితం చేసింది. ప్రధాని మోడీ ఈ సదస్సుకు అన్నీ తానే అయి సదస్సును అద్వితీయంగా నిర్వహించడం విశేషం. ప్రపంచశాంతిని ఆకాంక్షిస్తూ, వసుధైక కుటుంబాన్ని ఆవాహన చేస్తూ తనదైన శైలిలో ప్రపంచానికే మార్గదర్శకంగా మోడీ సారథ్యంలో రూపొందించిన న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను అన్నిదేశాల నేతలు ఏకాభిప్రాయంతో ఆమోదిం చడం భారత్‌కు గర్వకారణం. ఈ విజయం చరిత్రాత్మకం కూడా. దీంతో ప్రపంచంలో భారత్ ప్రతిష్ట మరింతగా ఇనుమ డించిందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. భారత్ అధ్యక్ష స్థానంలో జీ20 దేశాల కూటమి లక్ష్యాలను సాధించిందనే అనుకోవచ్చు. ప్రపంచ దేశాల ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌ మత్వాన్ని గౌరవించుకోవాలని, శాంతి సుస్థిరతలకు ఒకరి కొకరు సహకరించుకోవాలని జీ20 దేశాలు నిర్ణయించుకో వడం శుభపరిణామం. దాదాపు 125 దేశాలకు చెందిన నేతలు, లక్షమందికి పైగానే ప్రతినిధులతో ఇటీవల భారత రాజధాని ఢిల్లీలో జరిగిన జీ-20 సదస్సు కళకళలాడడం ఒక అపురూప ఘట్టం. రష్యా, చైనా దేశాధ్యక్షులు మాత్రం గైర్హాజరైనా అనేక దేశాల అగ్రనేతలు, ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు అమెరికా, బ్రిటన్, జపాన్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా తదితర ఎన్నో దేశాల నేతలు, అధినేతలు ఎంతో ఉత్సాహంతో భారత్‌కు వచ్చి ఈ సదస్సులో పాల్గొని ప్రపంచానికి సమైక్యతా సందేశాన్నివ్వడం జీ20 చరిత్రలోనే ఒక అరుదైన ఘట్టం. ఈ సందర్భంగా భారత్ ఎగరవేసిన శాంతిపతాకం సకల మానవాళికీ స్ఫూర్తిని, భారత్‌కు ముందెన్నడూ లేనంత గొప్ప కీర్తినీ సాధించిపెట్టింది. విశ్వశాంతి, పర్యావరణ పరిరక్షణ, సాంకేతికతను ఇచ్చిపుచ్చు కోవడం, మానవాళి అంతా ఒక్కటేననే భావంతో ఒకరికొకరు సహకరించుకోవడం, ఏ కష్టాలు కన్నీళ్లు లేని, ఏ ఉగ్రవాదాలు-యుద్ధాలు లేని శాంతియుత ప్రపంచాన్ని కళ్లముందు సాకారం చేసుకోవాలనే జిజ్ఞాస ఇప్పుడు ప్రపంచదేశాలను ముప్పిరి గొంటోంది. జీ-20ని మరింతగా విస్తరించాలంటూ భారత్ ప్రతిపాదన చేయడమే కాక, అందులో ఆఫ్రికన్ యూనియన్‌కు శాశ్వత సభ్యత్వం వచ్చేందుకు చొరవతీసుకోవడం జీ20 ప్రస్థానంలో మరో మేలిమలుపు. ఇది భారత్‌కు మరో అపురూప గౌరవం. ఈ సందర్భంగా ప్రధాని మోడీ సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్ (అందరితో, అందరి అభివృద్ధి, అందరి విశ్వాసం) అంటూ అందించిన సమైక్యతా నినాదం అందరి నోటా మంత్రంలా మార్మోగింది. సకలమానవాళి సంక్షేమమే అభివృద్ధికి వాస్తవ నిర్వచనమంటూ చేసిన ప్రధాని మోడీ ప్రసంగాలు అందరి కరతాళధ్వనులందుకున్నాయి. వాతా వరణ మార్పులు, సంక్షోభాలతో ప్రపంచ ఆర్థికవ్యవస్థ సతమతమవుతున్న తరుణంలో అనేక సమస్యలకు జీ20 పరిష్కారం చూపగలదని ఢిల్లీ సదస్సు నిరూపించిందని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ హర్షం ప్రకటించారంటే, భారత్ నిర్వహించిన ఈ సదస్సు ఎంత గొప్పగా జరిగిందో ఊహించుకోవచ్చు. అయితే, కేవలం సదస్సులు, ప్రతిజ్ఞలతో సరిపెట్టుకోక, ఆశించిన లక్ష్యాల సాధనకు, ఆచరణాత్మక కార్యాచరణకు అన్నిదేశాలు నడుం బిగించాలి. జీ20 ప్రణా ళికలు సఫలీకృతం కావాలి. భారత్ నిండుమనసుతో ఆకాం క్షిస్తున్నట్లుగా.. ప్రపంచ మానవాళి సంక్షేమానికి, సౌభ్రాతృ త్వానికి, సౌభాగ్యానికి.. అన్నిటికీ మించి విశ్వశాంతికి అన్ని దేశాల నేతలూ బాటలు వేయగలగాలి. అప్పుడే.. ఈ బృహత్తర సదస్సుల మహత్తరమైన ఆశయాలు ఏనాటికైనా కళ్లముందు సాకారం అవుతాయి.

# హాస్టళ్ల విద్యార్థుల గోడు పట్టించుకోండి

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

జిల్లాలో నిరుపేద విద్యార్థులు, బడుగు బలహీన వర్గాలవారు చదువుకుంటున్న అనేక హాస్టళ్ళలో వసతులు సక్రమంగా ఉండడం లేదు. వాళ్ళకిచ్చే డైట్ బిల్లులు చాలాతక్కువ. అవే చాలక అర్ధాకలితో అలమటిస్తుంటే, ఆ బిల్లులను కూడా ప్రభుత్వం చాలా హాస్టళ్ళవారికి గత కొద్ది నెలలుగా ఇవ్వకపోవ డంతో విద్యార్థులు పడే బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. అసలే నిరుపేద బిడ్డలు. తమ కష్టాలను ఎవరికి చెప్పుకుంటారు?..ఎంతటి అసౌకర్యాన్నయినా, చివరికి ఆకలికి అల్లాడుతున్నా ఎంతో మంది విద్యార్థులు తమ బాధలు బయటకు చెప్పుకోలేకపోతున్నారు. చిన్నవయసులో ఉన్న బాలబాలికలు హాస్టళ్ళలో ఏదిపెడితే అదే పరమాన్నంగా తినేస్తున్నారు. అంతకుతప్ప వారికి మరో మార్గం లేదు. ఆ ఆహారపదార్థాలు పాసిపోయాయో..బాగున్నాయో లేదో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసేవారు కరువయ్యారు. పేరుగొప్ప కోసం..ఎప్పుడో ఏదో నామ్‌కేవాస్తేగా అధికారుల పరిశీలనలు ఉంటాయే తప్ప, చిత్తశుద్ధితో ఎవరూ హాస్టళ్ళ సంగతి పట్టించుకోవడం లేదు. విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు ఇస్తామంటారు కానీ సక్రమంగా ఇవ్వరు. ఇచ్చారో లేదో అడిగేవారు కూడా లేరు. అనేక హాస్టళ్ళలో మంచినీళ్ళు, మరుగుదొడ్ల వసతి వంటి కనీస మౌలిక సదుపాయాలు కూడా సక్రమంగా ఉండవు. జైలు గదులున్నట్లు.. ఇరుకిరుకు గదుల్లోనే అందరూ చదువుకోవాలి, అక్కడే పడుకోవాలి. ఆ గదుల్లో ఎలాంటి సౌకర్యాలు ఉండవు. దోమలతో కుట్టించుకుంటూ విద్యార్థులు రాత్రంతా జాగారాలు చేస్తున్నా ఎవరూ వారి గోడు పట్టించుకోవడం లేదు. హాస్టళ్ళలో సమస్యలను ఎవరికైనా చెప్తే హాస్టల్ నుంచి బయటకి పంపించేస్తారని భయం. ప్రభుత్వం 'నాడు-నేడు' పేరుతో ప్రభుత్వ పాఠశాలలను బాగుచేస్తోందని అంటున్నారు కానీ, ప్రభుత్వ హాస్టళ్ల దుస్థితిని మాత్రం పట్టించుకోవడం లేదు. జిల్లా ఉన్నతాధికారులైనా ప్రత్యేక బృందాలతో ఎప్పటి కప్పుడు తనిఖీలు చేయించి, సమస్యలు గుర్తించి సానుకూలంగా పరిష్కరిస్తే ఎంతోమంది పేద విద్యార్థులకు సాయం చేసినట్లవుతుంది. **- కెబివిఎస్ సుబ్రహ్మణ్యం, కావలి రూరల్.**

### విద్యుత్ మోటార్ల

# దొంగతనాలు అరికట్టాలి

గ్రామీణ ప్రాంతాల్లో రైతుల పొలాల్లో ఉన్న విద్యుత్‌మోటార్ల చోరీలు నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. రైతులు ఎంతో కష్టపడి కొన్న ఆ మోటార్లలో ఉన్న రాగితీగ కోసం మోటార్లనే అపహరించుకుపోతు న్నారు. మరికొంతమంది దుండగులు ఏకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్‌లను కూడా పగలగొట్టేసి రాగితీగ దొంగిలిస్తున్నారు. పొలాలెక్కడో దూరంగా ఉంటాయి కనుక, దొంగలు నిర్భయంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. పొలాలకు నీళ్ళు పెట్టు కునేందుకు పెట్టుకున్న మోటార్లు దొంగ తనాలకు గురైతే ఎంత కష్టమో ఆలోచిం చండి. మోటార్లు కొనాలంటే వేలకు వేలు కావాల్సిందే. ఒకవేళ మళ్ళీ ఎట్లానో కష్టపడి కొని తెచ్చిపెట్టుకున్నా, అలవాటుపడిన దొంగలు వాటిని కూడా చోరీ చేయరని గ్యారంటీ ఏముంటుంది? గ్రామాల్లో రైతు లకు ఇది పెద్దసమస్యగా మారుతోంది. విద్యుత్‌శాఖ అధికారులు, లైన్‌మెన్లు, పోలీసులు సమన్వయంతో ఈ చోరీలపై దృష్టిపెట్టి, ఆ దుండగులెవరో కనిపెట్టి, వాళ్ళ ఆటలు కట్టించి, రైతులను ఆ కష్టాలనుంచి తప్పించాలని ప్రార్థన.

**ఎస్.జి కోదండయ్య, కొండాపురం.**




# పోలీసుల చేతులకి సంకెళ్లు..!

పోలీస్... పోలీస్ అంటే భరోసా, పోలీస్ అంటే భద్రత, పోలీస్ అంటే ధైర్యం, పోలీస్ అంటే రక్షణ. మన ఇంట్లో దొంగలు పడ్డారంటే పరిగెత్తుకొచ్చేది పోలీసే. ఎక్కడైనా గొడవ జరుగుతుందని కాల్ చేస్తే ఆగమేఘాలమీద వచ్చి వాలేది పోలీసే. అస్తవ్యస్థమైన ట్రాఫిక్ వ్యవస్థని నిత్యం అదుపు చేసేది పోలీసే... ధర్నాలు, దొమ్మీలు, బందులు, సభలు, సమావేశాలు, సాంస్కృతిక సంబరాలు, పెద్దోళ్ల ఇళ్లల్లో పెళ్లిళ్లు, కర్ఫ్యూలు, ఆఖరుకి కరోనా లాంటి మహమ్మారి పుణ్యమా అంటూ విధించిన లాక్‌డౌన్‌ని కూడా ప్రాణాలని సైతం పణంగాపెట్టి సక్రమంగా అమలు చేసేది కూడా ఈ పోలీసే. వీవీఐపీలు వస్తున్నారంటే మూడురోజుల ముందు నుండే ఎండనకా, వాననకా రోడ్లపై పహారా కాసేది కూడా ఈ పోలీసే.

దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, మానభంగాలు వంటివి జరగకుండా రాత్రీ పగలూ కాపలా కాసేదీ ఈ పోలీసే. ఏదైనా హత్య జరిగితే ఆ హత్య రెండు రోజులకో మూడు రోజులకో వెలుగులోకి వస్తే... దుర్గంధభూయిష్ఠంగా ఉన్న ఆ ప్రదేశానికి నేరుగా వెళ్లి సంఘటన జరిగిన చోటు నుండి ఆ మృతదేహాన్ని తరలించి, పోస్టుమార్టం చేయించి బాధితులకు అప్పజెప్పేదీ ఈ పోలీసే. ఘోరప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డవారిని ఆసుపత్రికి తరలించి, వారి ప్రాణాలను కాపాడేదీ ఈ పోలీసే. ఉగ్రవాదుల దాడులలో, నక్సలైట్ల ల్యాండ్‌మైన్లలో, ఎర్రచందనం గూండాల చేతుల్లో ప్రాణాలు కోల్పోతోందీ ఈ పోలీసే. సమాజ భద్రత కోసం భార్యాబిడ్డలని సైతం వదిలి, రోడ్లపై కాపురం చేసేదీ ఈ రక్షక భటులే. ఇలా చెప్పుకుంటూపోతే అసలు పోలీసువ్యవస్థే లేకపోయివుంటే.. అని తలుచుకుంటేనే, అమ్మో..భయమేసిపోతుంది.

## అలాంటి శాఖే ఇప్పుడు ఆపదలో ఉందా..?

ఆధునిక రాజకీయ వ్యవస్థలో, సమాజానికి భరోసా ఇచ్చి భద్రత కల్పించే పోలీసు శాఖే అవస్థలపాలవుతోందా...? అన్న అనుమానం కలుగుతోంది. రాజకీయ పార్టీల ఆధిపత్య పోరాటాల మధ్య ఖాకీ నలిగిపోతోందా...?? అన్న భావన కలుగుతోంది. రాజకీయనాయకుల అవతారమెత్తిన రౌడీషీటర్లకి, నేరస్థులకి, ఆర్థిక నేరగాళ్లకి సలాములు కొట్టలేక పోలీసుశాఖలో విధులు నిర్వహించేవారు తమలో తాము కుమిలిపో తున్నారా..??? అన్న ఆవేదన సర్వత్రా వ్యక్తమవుతోంది.

రాష్ట్రంలో జరుగుతున్న అనేక సంఘటనలని చూస్తుంటే ప్రజలని రక్షించే శాఖకే రక్షణ లేకుండా పోయిందనిపిస్తోంది. ఇటీవల చిత్తూరుజిల్లా అంగళ్ల వద్ద, ఆ తరువాత భీమవరం ప్రాంతంలోని తాడేరులో జరిగిన రెండు సంఘటనలు ఇలాంటి అనుమానాలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయనడంలో సందేహం లేదు. వైసీపీ - టీడీపీల మధ్య జరిగిన ముష్టియుద్ధంలో ఎక్కువగా పోలీసులు గాయాల పాలయ్యారు. పోలీసులను చూస్తేనే ఆమడదూరం పారిపోయే అల్లరి మూకలు, చిల్లర గ్యాంగులు... పోలీసులపైనే తిరగబడే స్థాయిలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు వారిని ప్రేరేపిస్తున్నారనడంలో అనుమానం అక్కరలేదు. మనం అధికారంలో ఉన్నాం, ఏం కాదు కొట్టండి అంటూ.... అధికార పార్టీ శ్రేణులు, రేపు మనమే అధికారంలోకి రాబోతున్నాం... అంతా మేం చూసుకుంటాం తిరగబడండి అంటూ ప్రతిపక్ష నాయకులు ఇద్దరూ చెరోవైపు చేరి దాడులను ప్రోత్సహిస్తున్నారు. వీరిద్దరి మధ్యలో పోలీసులు నలిగిపోతున్నారు.

## ముందు నుయ్యి.. వెనుక గొయ్యి..!

కొన్ని సందర్భాల్లో 'ముందు నుయ్యి - వెనుక గొయ్యి' అన్న చందంగా పోలీసుల పరిస్థితి ఉంటోంది. ఒకప్పుడు తమ ముందు చేతులు కట్టుకుని నిలబడ్డ రౌడీషీటర్లు ఇప్పుడు మంత్రులగానో, ఎం.ఎల్.ఏలగానో మారడం ఖాకీలకి మింగుడుపడడం లేదు. తమ ముందు కూర్చోవడానికి కూడా భయపడేవారికి తాము సెల్యూట్ చేయడానికి వారికి మనసు రావడం లేదు. మరోవైపు నైతిక విలువలతో, హుందా రాజకీయాలు చేసేవారిని అరెస్ట్ చేయడమో, వారిని ఇబ్బంది పెట్టడమో వంటి అంశాలు కూడా ఆ శాఖకు ఇబ్బందిగా మారాయి. కొన్ని సమయాల్లో అధికార పార్టీ నాయకుల ఆదేశాలకు తలొగ్గి, తమ వద్ద తగిన సాక్ష్యాలు ఉన్నా, నేరం చేసినవారిపైన కేసులు కూడా పెట్టలేని అసహాయ స్థితిలో ఆ శాఖ అధికారులు ఉండిపోవలసి రావడం శోచనీయం. గతంలో ఎన్నడూ లేని విధంగా తమ చేతులకు కూడా బేడీలు వేసేశారని ఆ శాఖలో పనిచేసే కొంతమంది ఉన్నతాధికారులే వాపోవడం ఇక్కడ గమనార్హం.

ఇలాంటి పరిస్థితికి కారణం ఏదైనా, కారకులు ఎవరైనా... ఇది మంచి సంప్రదాయం కాదు. రాజకీయ నాయకుల పదవులు శాశ్వతం కాదు. ఈరోజు మంత్రిగా ఉన్నవాళ్ళు, రేపు మాజీ మంత్రులు, ఆ తరువాత మాజీ ఎం. ఎల్.ఏ లు కూడా కావొచ్చు. కానీ, ప్రభుత్వ విభాగాలలో సేవలు అందించేవారు వాళ్ళు పదవీ విరమణ పొందేవరకు సమాజానికి సేవలు అందిస్తూనే ఉంటారు.

ఈ వాస్తవాన్ని నాయకులు గ్రహించాలి. ప్రభుత్వ విభాగాలలో పనిచేసే వారిని గౌరవించాలి. ముఖ్యంగా పోలీసు శాఖ ప్రాధాన్యతను గుర్తించాలి. అది మనందరి నైతిక బాధ్యతగా భావించాలి. ఎంతో క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన పోలీసు వ్యవస్థకు ప్రతిఒక్కరూ నిండు మనసుతో సహకరించాలి. విధినిర్వహణే ఊపిరిగా, సమాజ రక్షణే బాధ్యతగా ఉండే కర్తవ్యదీక్షాదక్షులు, సమాజసేవాపరాయణులు, ప్రజారక్షకులు, ప్రజా సేవకులు మన పోలీసులే...! వాళ్ళ చేతులకే సంకెళ్లు వేయడం ఎవరికీ శ్రేయస్కరం కాదు...!

- రాజశ్రీ

## నిశ్చయతాంబూలం



హైదరాబాదు లాంటి మహా నగరంలో నిర్మాణ రంగంలో సుదీర్ఘ అనుభవం గడించి, తమ సొంత జిల్లా నెల్లూరులో ప్రప్రథమంగా 22 అంతస్తుల అపార్ట్‌మెంట్ సముదాయాన్ని నిర్మిస్తున్న మన జిల్లావాసి గిలకా నరేంద్ర యాదవ్ - శ్రీమతి చంద్రికల కుమారుడు **పవన్ సాత్విక్ - మైథిలీరెడ్డి** (మేఘ కన్‌స్ట్రక్షన్స్ అధినేత పిచ్చిరెడ్డి బావమరిది రాజారెడ్డి - శ్రీమతి బృందారెడ్డిల కుమార్తెల నిశ్చితార్థ వేడుక సెప్టెంబర్ 10వ తేదీ హైదరాబాదులో ఆడంబరంగా జరిగింది.
ఇరువైపుల నుండి బంధుమిత్రులు అధిక సంఖ్యలో ఈ వేడుకలో పాల్గొని, కాబోయే జంటని దీవించారు.

### న్యాయవాద వృత్తి ఎంతో ఆదర్శమైనది..

# నిబద్ధతతో పనిచేయాలి

**- న్యాయవాదులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య పిలుపు**



న్యాయవాద వృత్తి ఎంతో ఆదర్శమైనదని, ఈ వృత్తిలో ఉన్న న్యాయవాదులు నిబద్ధతతో పనిచేసి రాణించాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముగ్గురు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జయసూర్య, జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ మన్మధరావు పాల్గొని దివంగత సీనియర్ న్యాయవాదుల చిత్రపటాలను ఆవిష్కరించారు. సీనియర్ న్యాయవాదులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ జయసూర్య మాట్లాడుతూ, దివంగత న్యాయవాదులను, సీనియర్లను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దివంగత సీనియర్ న్యాయవాదుల ఆశయాలను జూనియర్లు కొనసాగించాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ కె.మన్మధరావు కోరారు. తొలుత, ఇటీవల దివంగతులైన పివి రమణారెడ్డి, పివిఆర్‌కె సుబ్బుశర్మ, సోడే నాగేశ్వరరావుల చిత్రపటాలను వేదికపై ఆవిష్కరించారు. అనంతరం, న్యాయవాద వృత్తిలో 5 దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న సీనియర్ న్యాయవాదులు చతుర్వేదుల శ్రీరామమూర్తి, నాగారెడ్డి శ్రీనివాసులురెడ్డిని, అలాగే 4 దశాబ్దాలకుపైగా పనిచేస్తున్న ఎం.డి గౌస్‌బాషా, వేలూరు రవి, ఆర్.సత్యనారాయణ, వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, కె.దశరథరామయ్య, ఎన్. కోదండరామిరెడ్డి, ఓ.అబ్బాయిరెడ్డి, కెఆర్ దుర్గాం, తన్నీరు కోటయ్య తదితరులను హైకోర్టు న్యాయమూర్తులు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉమామహేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

జిల్లా జడ్జి సి.యామిని, 1వ అదనపు జిల్లా జడ్జి కపర్ది, ఏసీబీ కోర్టు స్పెషల్ జడ్జి సత్యవాణి, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.సుందరయ్య యాదవ్, మాజీ ప్రధాన కార్యదర్శి రామిరెడ్డి రోజారెడ్డి పాల్గొన్నారు.

## కార్మికుల భద్రతకే ప్రాధాన్యత



పోర్టు ఉద్యోగులకు, కార్మికులకు భద్రత కల్పించేందుకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని అదాని కృష్ణపట్నం పోర్టు సిఇఓ జిజెరావు చెప్పారు. పోర్టులో 'లైఫ్ సేవింగ్ సేఫ్టీ రూల్స్' అనే కార్యక్రమం ఇటీవల జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. జీవితాలను రక్షించే భద్రతకు సంబంధించిన అంశాలపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. అనంతరం 'భద్రత' అంశంపై పోటీలు నిర్వహించి విజేతకు బహుమతులు అందజేశారు. పోర్టు సిఓఓ సంజయ్ కొత్త, భద్రతా విభాగాధికారి రామకృష్ణ, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ గంటా వేణుగోపాల్, రమేష్‌బాబు, హెచ్‌ఆర్ డీజీఎం సిహెచ్ శ్రీనివాస్, అడ్మిన్ ఏజీఎం గంగా సతీష్, రామానంద్‌యాదవ్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

### సౌత్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా..

## వేమారెడ్డి



నెల్లూరు సౌత్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్‌గా కె.వేమారెడ్డి ఈ నెల11న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు.

### కొత్తసత్రం విద్యార్థులకు

## బంగారుపతకాలు

ఇటీవల తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ అండర్-15 పోటీల్లో కావలి రూరల్ మండలం కొత్తసత్రం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు తమ సత్తాచాటుకుని పతకాలు సాధించారు. సింగిల్ రోప్‌లో కె. మాధవి, 30 సెకన్ల స్పీడ్ విభాగంలో వై.జ్యోతి, డబుల్ బౌన్స్‌లో వై.కల్పన, త్రీ మినిట్స్ ఇండోరెన్స్‌లో వి.శాలిన, ఫ్రీస్టయిల్ విభాగంలో వి.సరిత బంగారు పతకాలు పొందారని పీఇటి మురళి తెలిపారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాసులు అభినందించారు.

### టీటీడీ విశాఖపట్టణం స్థానిక సలహా మండలి

# అధ్యక్షులుగా బద్వేలు సుబ్బారెడ్డి



తన శ్రీమతి జ్యోతితో సుబ్బారెడ్డి

హైదరాబాదులోని ప్రముఖ నిర్మాణ సంస్థ వంశీరామ్ బిల్డర్స్ సారధి, మన నెల్లూరు జిల్లా, పార్లపల్లి వాస్తవ్యులు బద్వేలు సుబ్బారెడ్డిని తిరుమల తిరుపతి దేవస్థానాల విశాఖపట్టణం ఆలయ సలహా మండలి అధ్యక్షులుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. దేవస్థానాల నిబంధనల ప్రకారం ఆయనకు టీటీడీ పాలకమండలి సభ్యులుగా కూడా స్థానం లభించింది. టీటీడీ ఆధ్వర్యంలో విశాఖపట్టణంలో నిర్మించిన స్వామివారి ఆలయానికి భక్తుల రద్దీ బాగా పెరిగింది. ప్రభుత్వానికి విశాఖని రాజధాని చేసే ఆలోచన కూడా ఉంది కాబట్టి భవిష్యత్తులో ఈ ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు అంకితమిస్తారు. ఈ క్రమంలో విశాఖపట్టణ ఆలయానికి సలహా మండలిని ఏర్పాటు చేసి, బద్వేలు సుబ్బారెడ్డిని అధ్యక్షుడిగా నియమించారు. సెప్టెంబర్ 16వ తేదీ శనివారం సుబ్బారెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. శ్రీవారి సేవాభాగ్యం పొందిన సుబ్బారెడ్డికి 'లాయర్' అభినందనలు.

# యువతకు ఉపాధి కల్పించాలనేదే ధ్యేయం

### మెగా జాబ్ మేళాలో రామ్



నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ధ్యేయంతో వెంకటగిరిలో మెగా జాబ్ మేళా నిర్వహించామని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మెన్, తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఇటీవల వెంకటగిరిలోని తమ నివాసంలో ఆయన నిర్వహించిన మెగా జాబ్ మేళాకు వందలాదిగా నిరుద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చి వారి కుటుంబాల్లో వెలుగుబాటలు పరవాలన్నది ఎంతో కాలం నుంచి తన ఆకాంక్ష అన్నారు. అవకాశం ఉన్నంతవరకు అందరికీ ఉద్యోగాలు ఇచ్చేందుకు కృషిచేస్తామని చెప్పారు.


నివాళి




నాకు అత్యంత ఆత్మీయులు
ఐదు దశాబ్దాలకు పైగా అపురూప అనుబంధం ఉన్న ఆప్తమిత్రులు
డాక్టర్ జి.రామచంద్రారెడ్డి గారి
(సింధూర నర్సింగ్ హోం, నెల్లూరు)
ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...
అశ్రునయనాలతో...
రావి మోహన్‌చౌదరి

# నెల్లూరు కబుర్లు

## వేడుకగా ఓనం సంబరాలు



నెల్లూరులోని మలయాళీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 10న స్థానిక టౌన్‌హాలులో ఓనం సంబరాలు సంప్రదాయబద్ధంగా జరిగాయి. పెద్దసంఖ్యలో మలయాళీయులు కుటుంబసమేతంగా వచ్చి ఈ పండుగ వేడుకలో పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళలు ఎంతో ఉత్సాహంతో స్వాగతద్వారం వద్ద రంగురంగుల రంగవల్లులు వేసి అలరించారు. పలువురు మహిళలు సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. హోటళ్ల సంఘం నాయకుడు అమరావతి కృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో సుమారు మూడువేలమంది మలయాళీలు నెల్లూరులో గత ఇరవైఏళ్ళుగా ఓనం వేడుకలను ఉత్సాహంగా జరుపుకుంటుండడం ఆనందకరమన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న పలువురు ప్రముఖులను సన్మానించారు. నారాయణ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ బిజూ రవీంద్రన్, ఆలిండియా మలయాళీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నందకుమార్, రాష్ట్ర కార్యదర్శి చాచప్పన్, జిల్లా అధ్యక్షుడు గోపి, మురుగన్, థామస్, మధు పులియత్, శివరామన్, కురియకోస్, జస్న, వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ సమితి.. కార్యాలయం ఏర్పాటు



స్థానిక విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితికి నగరంలోని ట్రంకురోడ్డులో ఉన్న టీవీఎస్ కల్యాణసదన్‌లో ఈనెల 12న కార్యాలయం ఏర్పాటైంది. ఉత్సవ సమితి కార్యనిర్వాహక అధ్యక్షులు వేలూరు మహేష్, కోశాధికారి ఏవిఆర్ మోహన్‌రావు పూజలుచేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. నగరంలో వినాయకచవితి మండపాల నిర్వాహకులకు సహకారం అందించేందుకు తాము కృషిచేస్తున్నామని నిర్వాహకులు ఈ సందర్భంగా చెప్పారు. సమితి సభ్యులు భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున, రంగరాజన్, కృష్ణారెడ్డి, చంద్ర, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



ఇటీవలే ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డునందుకున్న నెల్లూరు కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.భాస్కర్‌రావు సేవలను కొనియాడుతూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ ఈనెల 12న ఆయన్ను ఘనంగా సత్కరించారు. విజయవాడలోని సమగ్రశిక్ష కార్యాలయంలో ఈ అభినందన సత్కారం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## సాయిచరణికి అభినందన



నెల్లూరులోని కెఎన్ఆర్ పాఠశాల విద్యార్థిని, ఎన్‌సిసి కేడెట్ సాయిచరణి ఇటీవల నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) ప్రతిభా పరీక్షలో 180మార్కులకు గాను 155మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించడంతో ఈనెల 12న స్థానిక ఎన్‌సిసి కార్యాలయంలో నెల్లూరు-10 ఆంధ్ర నావెల్ యూనిట్ లెఫ్టినెంట్ కమాండర్ వినయ్ రామచంద్రన్ సాయిచరణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు గుండాల నరేంద్రబాబు, సీవీ నాగరాజు, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్‌శాఖకు కొత్త ఎస్ఇ



• బాధ్యతలు చేపట్టిన విజయన్

జిల్లా విద్యుత్‌శాఖకు కొత్త ఎస్ఇ (సూపరింటెండింగ్ ఇంజనీర్) వచ్చారు. చిత్తూరుజిల్లా పుంగనూరులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న విజయన్‌ను ఏపీఎస్పీడిసిఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఇగా నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. ఈనెల 12న ఆయన నెల్లూరు విద్యుత్‌భవన్‌లో ఆమేరకు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటిదాకా ఈ స్థానంలో ఇక్కడ పనిచేస్తున్న బి.వెంకటసుబ్బయ్యను తిరుపతిలోని కార్పొరేట్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.



## నేత్రపర్వంగా..కాత్యాయని వ్రతం

నెల్లూరు దర్గామిట్టలో కొలువైవున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 12న ఆలయ అర్చకులు ఎంతో విశిష్టమైన కాత్యాయని వ్రతాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రఘురామశర్మ, వేదపండితుడు వెంకటరామకృష్ణశర్మ ఆధ్వర్యంలో నేత్రపర్వంగా జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ రత్నం జయరామ్, ఇఓ వెంకట శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు రామ్మోహన్‌రెడ్డి, దొరబాబు, సతీష్ తదితరులు పర్యవేక్షించారు.

## గొలగమూడికి 17న పాదయాత్ర



గొలగమూడిలో ఉన్న అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి సన్నిధిని దర్శించుకునేందుకు ఈనెల 17న నెల్లూరు నగరం నుంచి పాదయాత్ర చేపడుతున్నామని, పాల్గొనదలచిన భక్తులు తమను సంప్రదించాలని స్థానిక సాయిదర్బార్ అద్దాల మందిరం ఛైర్మన్ మధుసాయి కోరారు. ఈనెల 12న సాయిదర్బార్‌లో ఆహ్వానపత్రికలను ఆయన ఆవిష్కరించారు. పాదయాత్ర చేసే భక్తులు ఈనెల 15లోపు తమ పేర్లు ఇవ్వాలని, వివరాలకు 88856 44118, లేదా 95028 49784 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

## డిఇఓ గంగాభవాని..జేడీ అయ్యారు




జిల్లా విద్యాశాఖ అధికారి గంగాభవానికి ఉద్యోగోన్నతి లభించి ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ (జేడీ) అయ్యారు. ఇటీవల జరిగిన డిపార్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో ఆమేరకు ఆమెకు జేడీగా ప్రమోషన్ ఇచ్చారు. కానీ, ప్రస్తుతానికి ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఈలోగా ఆమె డిఇఓగానే విధులు నిర్వహిస్తారని తెలుస్తోంది.

## 'తంగిరాల మహాభారతం' 72వ భాగం

రాజసూయ యాగం అయిపోయిన తరువాత దుర్యోధనుడు మయసభ తిలకించాలని ఆ సభలో ప్రవేశించి, దాని విచిత్ర శిల్ప నైపుణ్యాన్ని చూసి ఆశ్చర్యంతో తన్మయుడైపోతాడు.

ద్వారాలు ఉన్నట్లు, లేనట్లు భ్రమపడి భంగపడతాడు. అలాగే కొలనులో నీళ్లు ఉన్నాయో లేవో తెలియక తికమకపడి ఒక కొలనులో జారిపడతాడు. తన తొట్రుపాటు చూసి పాండవులు, ద్రౌపది నవ్వుకున్నారని అవమానపడి తిరిగి హస్తినాపురం వచ్చేస్తాడు.




ధర్మరాజు వైభవం, సోదరుల పరాక్రమ శక్తితో సంపాదించిన ఐశ్వర్యం చూసి అసూయతో తనకు జరిగిన అవమానాన్ని తలచుకొని కుమిలి కుమిలి దుఃఖిస్తాడు.

నిద్రాహారాలు మానేసి ఎవరితో మాట్లాడకుండా కళావిహీనుడై చింతిస్తున్నప్పుడు, శకుని వచ్చి కనుక్కొని అడిగినప్పుడు జరిగింది చెప్పి, ఎలాగైనా వారి ఐశ్వర్యం స్వాధీనపర్చుకొనే మార్గం చెప్పమంటే, శకుని ఒక ఉపాయం చెప్పి తండ్రి గారి అంగీకారం కావాలంటాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది.
పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.




## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు.. ఐక్యంగా పోరాడాలి



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఐక్యం పోరాడి సమస్యలు సాధించుకోవాలని ఏపీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లం సురేష్‌బాబు పిలుపునిచ్చారు. ఈనెల 10న నెల్లూరులోని ఏపీఆర్ఎస్ఏ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచడంతో పాటు, ప్రత్యేక సర్వీస్ రూల్స్‌ను ఏర్పాటుచేయాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ, అక్టోబర్‌లో రాష్ట్రస్థాయిలో మహాజన సభ నిర్వహిస్తామని తెలిపారు. జేఏసీ ఒంగోలు ఛైర్మన్ వేణు, జిల్లా కమిటీ నాయకులు మస్తానయ్య, మహేష్‌బాబు, వెంకటేష్, రాధమ్మ, విజయకుమార్, శరత్‌బాబు, ఓవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఐఎస్ఎఫ్ మహాసభలు

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర నిర్మాణ మహాసభలు నెల్లూరులో ఈనెల 15, 16 తేదీల్లో జరగనున్నాయని ఆ సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ మస్తాన్ షరీఫ్ తెలిపారు. ఈనెల 12న స్థానిక ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో విద్యార్థి నాయకులు మాట్లాడారు. విద్యార్థుల సమస్యల సాధనకు ఏఐఎస్ఎఫ్ ఎంతోకాలంగా పోరాటం చేస్తోందని పేర్కొన్నారు. ఈ సభల్లో కూడా విద్యారంగానికి సంబంధించి అనేక సమస్యలను చర్చించడం జరుగుతుందని, పెద్దసంఖ్యలో విద్యార్థులు ఈ మహాసభలకు తరలిరావాలని పిలుపునిచ్చారు.



# లక్ష కుటుంబాల కష్టసుఖాలు తెలుసుకున్న ప్రజాసేవకుడు

## కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నను ప్రశంసించిన నాయకులు

'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోవూరు నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో తిరుగుతూ, మారుమూలన ఉన్న గ్రామల ప్రజలను కూడా కలుస్తూ, వారి కష్టాలు వింటూ, సమస్యలు తీరుస్తూ కనీవినీ ఎరుగని విధంగా లక్ష గడపలు తిరిగి, లక్షలాది ప్రజల గుండెల్లో ప్రజానాయకునిగా మరింత మంచిపేరు సాధించుకోవడం విశేషం. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన ప్రముఖ నాయకులు ఎమ్మెల్యే ప్రసన్నను అభినందించారు. లక్ష కుటుంబాల వారి కష్టసుఖాలు తెలుసుకున్న ప్రజాసేవకునిగా కొనియాడారు. ఎమ్మెల్యే ప్రసన్న లక్ష గడపలు తిరగడం పూర్తిచేసుకున్న సందర్భంగా ఇందుకూరు పేట మండలం, మైపాడు గ్రామంలో ఈనెల 7వ తేదీ సాయంత్రం వైకాపా నాయకుడు దువ్వూరు కల్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయోత్సవ సభ కూడా పెద్దఎత్తున జరిగింది. ప్రసన్నతో పాటు, ఆయన అభిమానులు,



నాయకులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, జడ్పీ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, నాయకులు వీరి చలపతిరావు, ఇంకా అనేకమంది జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి శుభాకాంక్షలు చెప్పారు.



## ఎన్‌బికెఆర్ పీడీకి..

## సబ్ లెఫ్టినెంట్ హోదా

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల పీడీ (ఫిజికల్ డైరెక్టర్) డా. వి.మల్లికార్జునరెడ్డికి సబ్‌లెఫ్టినెంట్ హోదా లభించింది. 10-ఆంధ్ర నావెల్ ఎన్‌సిసి యూనిట్ విభాగంలో ఈ హోదా వచ్చిందని, ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ-కంప్టి, నాగపూర్‌లో ఇటీవల 90 రోజుల పాటు కఠినమైన శిక్షణ పొంది ఆయన దీనిని సాధించారంటూ కళాశాల డైరెక్టర్ డా.వి.విజయకుమార్ రెడ్డి ఆయన్ను ఈనెల 12న కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఇలాంటి ఉన్నత స్థాయి రావడం కళాశాల నావెల్ క్యాడెట్ల ఎదుగుదలకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని ఆయన ఆకాంక్షించారు.

## కోటమ్మతల్లి దేవస్థానంలో ప్రసన్న



తిరుపతి జిల్లా, గూడూరు నియోజకవర్గం, కోట మండలంలో వెలసివున్న శ్రీకోటమ్మ తల్లి దేవస్థానాన్ని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న ఇటీవల సందర్శించారు. భక్తుల కోసం దాతల సహాయంతో కొత్తగా నిర్మించిన వసతి సముదాయాలకు ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గ యువజన విభాగం కమిటీ అధ్యక్షులు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, స్థానిక వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ వేంకటేశ్వరుని కల్యాణోత్సవం

నెల్లూరు రంగనాయకులపేటలోని ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో ఈనెల 10న శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సన్‌రైజ్ గ్రూప్ సభ్యులు చందోలు సతీష్ కుమార్‌తో పాటు సభ్యులు, ఆర్యవైశ్య మిత్రులు సంయుక్తంగా ఈ వేడుకను నిర్వహించారు. స్వామివారికి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం కల్యాణోత్సవం, పుష్పయాగం చేపట్టారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ గావించారు.



## గౌరవపూర్వక కలయిక

తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మన్‌గా రెండవసారి నియమితులైన తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకరరెడ్డిని ఇటీవల తిరుపతిలో మన నెల్లూరీయులు, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు (బీఎంఆర్) గౌరవపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పి సన్మానించారు.

# రూరల్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేస్తాం

## - ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు తనవంతు బాధ్యతగా పనిచేస్తామని నెల్లూరు ఎంపీ, రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. నెల్లూరు రూరల్‌లోని 20వ డివిజన్ షార్ కాలనీలో రోడ్డు నిర్మాణ పనులకు ఆయన ఇటీవల శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ, 20వ డివిజన్లో ఇప్పటివరకు 6కోట్ల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. మరో కోటి రూపాయల నిధులు మంజూరుచేసి ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేస్తామని చెప్పారు. 20వ డివిజన్ అధ్యక్షులు రావు శ్రీనివాసరావు (ఆర్ఎస్ఆర్), తాళ్లూరు సురేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, 20వ డివిజన్ వైకాపా నాయకులు చెవిరెడ్డి గోపాల్‌రెడ్డి, పోలంరెడ్డి నాగేశ్వరరెడ్డి, రావూరు నరసింహారెడ్డి, రామ్మోహన్ యాదవ్, గొడుసు సరళమ్మ, వాసంతి రెడ్డి, కడివేటి ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## కొండ్లపూడిలో 11 కేవీ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవం

నెల్లూరు రూరల్, కొండ్లపూడి జగనన్నకాలనీలో నిర్మించిన 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు డీసీసీబీ మాజీ ఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డితో కలిసి ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈనెల 12న ప్రారంభోత్సవం చేశారు. రూరల్ ప్రజలకు మెరుగైన విద్యుత్ సౌకర్యాన్ని అందజేయాలన్న లక్ష్యంలో భాగంగా ఈ ప్రారంభోత్సవం జరిగిందని ఆయన చెప్పారు. రూరల్ ఎంపీపీ విజయకుమార్, నరసింహకొండ ఆలయం ఛైర్మన్ వేమిరెడ్డి నరేంద్రరెడ్డి, రైల్వేబోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.


23వ వర్ధంతి



కీ॥శే॥ శ్రీ జక్కా రంగారెడ్డి
(మరణం - 18.09.2000)
మహనీయుని దివ్యస్మృతికి మా భాష్పాంజలి

భార్య : జక్కా కామేశ్వరమ్మ
కుమారులు
జక్కా కోదండరామిరెడ్డి
జక్కా శ్రీనివాసులురెడ్డి
జక్కా శివనారాయణరెడ్డి
మరియు కుటుంబసభ్యులు





## అక్టోబర్ 4, 5 తేదీల్లో..
# వెంకటగిరి పోలేరమ్మ జాతర
### - ఏర్పాట్లను సమీక్షించిన రామ్‌కుమార్‌రెడ్డి




వెంకటగిరి గ్రామశక్తి, చల్లనితల్లి.. కష్టాలు తీర్చి, కోరిన కోర్కెలు నెరవేర్చే కరుణామయి శ్రీ పోలేరమ్మ అమ్మవారి జాతరకు వెంకటగిరి సిద్ధమవుతోంది. అక్టోబర్ 4, 5 తేదీల్లో జాతర అంగరంగ వైభవంగా జరగనుంది. రాష్ట్రంలోనే ఎంతో ప్రసిద్ధిగాంచిన గ్రామదేవత, మహా శక్తిస్వరూపిణి పోలేరమ్మ అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా చేయాలని ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రామ్‌కుమార్‌రెడ్డి కోరడం, ఆమేరకు సిఎం వెంటనే సానుకూలంగా స్పందించి రాష్ట్ర పండుగగా పరిగణిస్తూ జీఓ కూడా విడుదల చేయడం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమ్మవారి జాతరను మరింత వైభవోపేతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు భారీగా జరుగుతున్నాయి. తిరుపతి-నెల్లూరు ఉభయ జిల్లాల నుంచే కాక, రాష్ట్ర వ్యాప్తంగా భక్తులు వేలసంఖ్యలో జాతరకు తరలివస్తారు కనుక, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసే పనిలో అధికారవర్గాలు, ఆలయవర్గాలు తలమునకలుగా ఉన్నాయి. తిరుపతి జిల్లా వైకాపా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త, రాష్ట్ర కమ్యూనిటీ బోర్డు డెవలప్‌మెంట్ ఛైర్మెన్ నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి ఈనెల 13న వెంకటగిరిలోని తమ నివాసంలో సమన్వయ సమావేశం ఏర్పాటుచేసి జాతరకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలను అధికారులతో చర్చించారు. భక్తులకు అవసరమైన మౌలిక సదుపాయాల విషయంలో ఎలాంటి లోటు లేకుండా అన్ని ఏర్పాట్లు చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ● ప్రసన్నరెడ్డి ఇంట మరో విషాదం
# పొలిచర్ల శ్రీనివాసులురెడ్డి కన్నుమూత



పొలిచర్ల కుటుంబంలో మరో విషాదం చోటు చేసుకుంది. పి.వి.ప్రసన్న రెడ్డి అమ్మ శారదమ్మ దివంగతురాలైన ఆమె పెద్దకర్మ జరగక ముందే ప్రసన్నరెడ్డి తమ్ముడు పొలిచర్ల శ్రీనివాసులురెడ్డి సెప్టెంబర్ 14వ తేదీ గురువారం తెల్ల వారుఝామున కన్నుమూశారు. శీనయ్య వయస్సు 67 సంవత్సరాలు. ఆయనకి భార్య సుదర్శన, కుమారుడు శరణ్ త్రిసూల్ ఉన్నారు. గత కొన్ని రోజులుగా ఆయన అస్వస్థతకి గురై చికిత్స తీసుకుంటున్నారు. నెల్లూరుజిల్లా మానేగుంటపాడు గ్రామంలో పేరుమోసిన రైతు కుటుంబం వారిది. పొలిచర్ల జనార్ధనరెడ్డి - శారదమ్మ దంప తులకు 1956, మే 9న శ్రీనివాసులురెడ్డి రెండవ సంతానంగా జన్మించారు. చిన్న ప్పటినుండీ శీనయ్యని చురుకైన వాడిగా పిలిచేవారు. తనకి అత్యంత ఇష్టమైన ఎయిరోనాటికల్ ఇంజనీరింగ్ చదివి పట్టా పుచ్చుకున్నారు.

కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ఎయిరో నాటికల్ వైపు వెళ్లకుండా అన్న ప్రసన్నరెడ్డికి తోడుగా మాగుంట వారి బాలాజీ డిస్ట్రి బ్యూటర్స్ తదితర విభాగాలలో పద్నా లుగు సంవత్సరాలు విధులు నిర్వహిం చారు. ప్రసన్నరెడ్డి తమిళనాడులోని తిరు చిరాపల్లిలో నెలకొల్పిన ట్రిచి స్టీల్ రోలింగ్ మిల్స్ లిమిటెడ్ నిర్మాణ దశలో శ్రీనివా సులురెడ్డే సారధ్యం వహించారు. అనం తరం జీవికే గ్రూప్‌లో చేరి తమిళనాడు లోని పెరంబలూరు వద్ద ఆ సంస్థ ఏర్పాటు చేయతలపెట్టిన ప్రత్యేక ఆర్థిక మండలికి అవసరమైన 3 వేల యకరాల భూమి సేకరించడంలో శీనయ్యది కీలకపాత్ర. గత కొన్ని సంవత్సరాలుగా అమ్మకి తోడుగా మానేగుంటపాడులో ఉంటూ గ్రామ రాజకీయాలలో చురుకుగా పాల్గొంటూ ఊరి అవసరాలను తీర్చ డంలో భాగస్వామ్యుడయ్యారు. గడచిన రెండు దశాబ్దాలుగా ఏకగ్రీవమే తప్ప ఎన్నికలే ఎరుగని మానేగుంటపాడు గ్రామ పంచాయతీకి ఎన్నికలు అనివార్యమైన తరుణంలో 2021లో జరిగిన సర్పంచ్ ఎన్నికలలో శ్రీనివాసులురెడ్డి పోటీచేసి 5వసారి తమ గ్రామ సర్పంచ్‌గా బాధ్య తలు చేపట్టారు. కన్నతల్లికి, పుట్టిన ఊరుకి సేవచేస్తూ గత కొన్ని సంవత్సరాలుగా గ్రామంలోనే స్థిరపడ్డారు. సాఫీగా సాగి పోతున్న శీనయ్య జీవితంలోకి క్యాన్సర్ మహమ్మారి ప్రవేశించి ఆయనని పొట్టన పెట్టుకుంది. పది రోజుల వ్యవధిలో కుటుంబంలో ఇద్దరిని కోల్పోయి శోక సంద్రంలో ఉన్న పొలిచర్ల కుటుంబ సభ్యులకి, తమ గ్రామానికి పెద్ద దిక్కుగా ఉన్న ఇద్దరినీ కోల్పోయి శోకిస్తున్న మానేగుంటపాడు ప్రజలకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# సింధూర రామచంద్రారెడ్డి ఇక లేరు
## ● రామచంద్ర మెడికల్ కాలేజీకి దేహదానం



గత నలభై సంవత్సరాలుగా నెల్లూరు వైద్యరంగానికి చిరపరిచితులైన డాక్టర్ గడి రామచంద్రారెడ్డి సెప్టెంబర్ 13వతేది తెల్ల వారుఝామున చెన్నైలో కన్నుమూశారు. ఆయన వయస్సు 70 సంవత్సరాలు. ఆయ నకి భార్య ధరణిజ , కుమారుడు శమంత్, కుమార్తె సింధూర ఉన్నారు. నెల్లూరు కస్తూరిదేవి విద్యాలయం ప్రాంతంలో సింధూర నర్సింగ్ హోం అంటే తెలియని వారు బహుశా బహు అరుదు. 1953లో అన్నారెడ్డిపాలెంలో రైతు కుటుంబంలో జన్మించారు రామచంద్రారెడ్డి. నెల్లూరులో ప్రాథమిక విద్య పూర్తిచేసిన అనంతరం కర్ణాటక రాష్ట్రం బెల్గామ్‌లో యం.బి. బి.ఎస్ పట్టా అందుకుని, ఆ తరువాత మణిపాల్ నుండి మాస్టర్స్ డిగ్రీ పుచ్చు కున్నారు.

1978లో సామంతుల వారి ఆడ పడుచు ధరణిజని పరిణయమాడారు. మాస్టర్స్ పూర్తయ్యాక 1983 ప్రాంతంలో నెల్లూరులో సింధూర నర్సింగ్ హోం పేరుతో ఆసుపత్రిని ప్రారంభించారు. ఆ రోజుల్లో నెల్లూరులో ఆధునిక వైద్య సదుపాయాలు ఉన్న తొలి ప్రైవేటు ఆసు పత్రి 'సింధూర'నే!...

అందుచేతనే ఆయన సింధూర రామచంద్రారెడ్డిగా ప్రసిద్ధి చెందారు. కొన్ని సంవత్సరాలుగా కాలేయానికి సంబంధిం చిన వ్యాధితో చికిత్స పొందుతూ బుధ వారం మద్రాసులో తుదిశ్వాస విడిచారు.

రామచంద్రారెడ్డి వ్యక్తిగత సంబం ధాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారు. ఆయనకి మిత్రులు ఎక్కువ. తమ ఆసు పత్రికి పేదవాళ్ళు వస్తే ఫీజు విషయం పెద్దగా పట్టించుకునేవారు కాదు. వాళ్ళు ఎంత ఇస్తే అంత తీసుకునేవారు. కొంత మందికి ఉచితంగా కూడా వైద్యం అందిం చేవారు. సామాజిక స్పృహ కలిగి ఉండే వారు. తన దేహానికి సైతం అంత్యక్రియలు చేయొద్దని ముందే చెప్పడంతో ఆయన మరణానంతరం ఆయన భౌతిక కాయాన్ని చెన్నైలోని రామచంద్రా మెడికల్ కాలేజీ అనాటమీ విభాగం వారికి కుటుంబ సభ్యులు అప్పజెప్పారు. నేత్రాలను కూడా దానం చేశారు. ఆయన కుమార్తె సింధూర కూడా చెన్నైలో దంత వైద్యురాలిగా సేవలందిస్తోంది. కుమారుడు శమంత్ అమెరికాలో స్థిరపడ్డారు.

రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్
### మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్



తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడిని కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అక్రమ అరెస్ట్ చేశారని, చంద్రబాబు కోసం ప్రాణత్యాగానికైనా తాను సిద్ధమని మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని ఆయన నివాసం వద్ద ఈ నెల 10వ తేదీ నాయకులతో కలసి సామూహిక నిరాహారదీక్ష నిర్వహించారు. సిలికా, క్వార్ట్జ్, గ్రావెల్ అక్రమంగా రవాణా చేస్తూ వైకాపా నాయకులు కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానాని కొల్లగొడుతున్నారని, పోలీసులు వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు గుండాల లీలావతి, వాటంబేటి శివకుమార్, భారతి, జహంగీర్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాలకృష్ణంరాజు దాతృత్వంతో గర్భిణీ స్త్రీలకు భోజనాలు



గూడూరు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఎవిఎస్ఆర్ న్యూక్లల్ కరస్పాండెంట్ నందిమండలం బాలకృష్ణం రాజు దాతృత్వంతో ఇటీవల గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని నిరుపేద గర్భిణీ స్త్రీలకు భోజనాలు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులు డాక్టర్ రాజా, డాక్టర్ రవి చేతుల మీదుగా ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. జే.వి.వి. అధ్యక్షులు వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, రామమోహన్, గుర్రం విజయ్‌బాబు, కటకం శ్రీను, జగదీష్, మురళీసింగ్, అశోక్, వడ్లమూడి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ క్లబ్ వెస్ట్ అధ్యక్షులుగా
# సనత్‌కుమార్‌రెడ్డి



గూడూరు రోటరీ క్లబ్ వెస్ట్ అధ్యక్షులుగా ఉన్న నరసప్ప విదేశాలకు వెళ్ళిన కారణంగా ఆయన స్థానంలో రొటేరియన్ సనత్‌కుమార్‌రెడ్డిని 2023-24 రోటరీ ఇయర్‌కు అధ్యక్షులుగా ఉండేందుకు క్లబ్ సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో, రోటరీ వెస్ట్‌క్లబ్ అధ్యక్షుడిగా సనత్‌కుమార్‌రెడ్డి ఇటీవల ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రొటేరియన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ధనంజయరెడ్డి, మయూరి శ్యాంయాదవ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొని ఆయనను అభినందించారు.

# మౌలిక వసతులు కల్పిస్తాం
### ఆర్డీఓ కిరణ్‌కుమార్



కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేలా కృషిచేస్తామని ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. గూడూరు పట్టణంలోని జక్కా వెంకయ్య శ్రామికనగర్‌లో ఆయన ఇటీవల పర్యటించి స్థానిక సమస్యలను అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మాణం చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదకరంగా ఉండే ట్రాన్స్‌ఫార్మర్‌ని వేరొక ప్రాంతంలో ఏర్పాటు చేసేలా దిస్కం అధికారులకు సూచిస్తామన్నారు. అనంతరం, ఆర్డీవోను ప్రజలు సన్మానించారు.



# జడ్పీ ఉద్యోగులకు అరుణమ్మ వరాలు

ఆనం అరుణమ్మ జడ్పీ ఛైర్మెన్ అయ్యాక జడ్పీ ఉద్యోగులకు సంబంధించిన అనేక సమస్యలు తీరిపోతున్నాయి. ఎంతోకాలంగా ఉద్యోగులు ఎదురుచూస్తున్న ప్రమోషన్లకు అరుణమ్మ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో జడ్పీ ఉద్యోగుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈనెల 7న ఒకేసారి ఆఫీస్ సబార్డినేట్లకు, రికార్డ్ అసిస్టెంట్లు, లాబొరేటరీ అసిస్టెంట్లకు మొత్తంగా 24 మందికి ఉద్యోగోన్నతి పత్రాలను ఆమె అందజేశారు. మరో ఆరుగురికి కారుణ్యనియామక పత్రాలను కూడా అందజేశారు. జడ్పీ సిఇఓ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లోనూ రాణించాలి

**నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి**



క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసాన్ని కలుగజేస్తాయని, యువత క్రీడల్లోనూ రాణించాలని కోవూరు నియోజకవర్గ వైకాపా యువజన విభాగం అధ్యక్షుడు, ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తనయుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఈనెల 10న కోవూరు సమీపంలోని పడుగుపాడు గ్రామంలో అట్లూరి సుబ్రహ్మణ్యం స్మారక క్రికెట్ టోర్నీ పోటీల్లో విజేతలకు ఆయన చేతులమీదుగా బహుమతులు పంపిణీ చేశారు. డీఏఏబీ ఛైర్మెన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ ఛైర్మెన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నర్సింహులురెడ్డి పాల్గొన్నారు.

# శ్రీసిటీలో స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ బృందం



అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ విభాగానికి చెందిన 20 మంది అధ్యాపకులు మరియు విద్యార్థుల ప్రతినిధుల బృందం ఈనెల 8న శ్రీసిటీని సందర్శించారు. ప్రొఫెసర్ మైకెల్ కోచెండర్‌ఫర్, పీహెచ్‌డీ స్కాలర్ డైలాన్ మిచెల్ అస్మార్ నేతృత్వంలో శ్రీసిటీకి వచ్చిన ఈ బృందానికి శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ ఛైర్మెన్ సి.శ్రీనిరాజు వర్చువల్ మోడ్‌లో వీరితో మాట్లాడుతూ, 1980లలో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంతో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'వర్క్, లివ్, లెర్న్, ప్లే' సూత్రం ఆధారంగా సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా పచ్చదనం, పరిశుభ్రత, పారిశ్రామిక అనుకూల వాతావరణంలో శ్రీసిటీ ప్రగతి సాగుతోందని ఆయన వారికి చెప్పారు. పారిశ్రామిక విస్తరణ, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతుల్యతను కాపాడడంపై తాము ప్రత్యేకదృష్టి సారించామన్నారు. భారతదేశంలో మొట్టమొదటి కార్బన్-న్యూట్రల్ పారిశ్రామికవాడగా శ్రీసిటీ అవతరించాలన్నది తమ ఆకాంక్ష అని ఆయన అన్నారు. పెప్సికో, క్యాడ్‌బరీస్, కోల్‌గేట్ పామోలివ్, విఆర్‌వి-చార్ట్ ఇండస్ట్రీస్, బాల్ కార్పొరేషన్, కెల్లాగ్స్, వెస్ట్‌ఫార్మా సహా 11 ప్రముఖ అమెరికన్ కంపెనీలతో పాటు ప్రపంచంలోని 28 దేశాలకు చెందిన 210 పరిశ్రమలు శ్రీసిటీలో ఏర్పాటైనట్లు సతీష్ కామత్ తెలిపారు. అనంతరం, ప్రతినిధుల బృందం శ్రీసిటీ పరిసరాలను పరిశీలించింది.

# జిల్లా బీజేపీ పగ్గాలు.. వంశీధర్‌రెడ్డికి




బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ముత్తుకూరు మండలం నేల టూరుకు చెందిన వంశీధర్‌రెడ్డి నియమితులయ్యారు. తొలినుంచీ ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఎదిగిన వంశీ, పార్టీ వర్గాల వారందరికీ సుపరిచితులే. విద్యార్థి దశలో ఏబీవీపీ నాయకుడిగా, ఆ తర్వాత బీజేపీ యువమోర్చా, కిసాన్ మోర్చాలకు జిల్లా అధ్యక్షునిగా కూడా పనిచేశారు. పార్టీ జిల్లా కార్యదర్శిగా, ప్రధాన కార్యదర్శిగా కూడా రెండుసార్లు కొనసాగిన చరిత్ర ఉంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఇటీవల ఆయన్ను జిల్లా అధ్యక్షునిగా నియమించింది. దీంతో పార్టీ నాయకులు వంశీని అభినందించారు.

# ఆలయాల్లో చోరీలు.. భయాందోళనల్లో ప్రజలు

- **లేబూరు కుంకాళమ్మ గుడిలో దొంగలుపడ్డారు**
- **మొగళ్లపాళెం రామాలయంలో నగలు కాజేశారు**

గుళ్లదొంగలు జిల్లాను హడలగొట్టేస్తున్నారు. గత వారం దుత్తలూరు మండలంలో ఒకేరోజు ఒకే పంచాయతీలోని రెండుగ్రామాల్లో ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఆరు ఆలయాలను దోచుకున్నారంటే దొంగలెంత గుండెలుతీసిన బంట్లో అర్థమవుతూనే ఉంది. అంతటితో ఆగలేదు. ఈనెల 7న కృష్ణాష్టమి రోజునే నెల్లూరు రూరల్ మండలంలోని సౌత్ మోపూరు పంచాయతీలో ఉన్న మొగళ్ల పాళెం గ్రామంలో ఉన్న రామాలయాన్ని దొంగలు టార్గెట్ చేశారు. కృష్ణాష్టమి వేడుకలు, పూజలు అన్నీ భక్తజనంతో కోలాహలంగా జరిగిన తర్వాత, రాత్రికి గుడి తలుపులు మూసేసి అందరూ వెళ్ళి పోయారు. అంతా సద్దుమణిగిన తర్వాత దొంగలు తాపీగా వచ్చి తమ పని కానిచ్చే శారు. గుడి తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్ళి, అమ్మవారి మెడలోని మంగళసూత్రం లాగేశారు. సీతారామలక్ష్మణు లకు, హనుమంతుని విగ్రహానికి పెట్టివున్న వెండి కిరీటాలను మూటగట్టుకున్నారు. పోతూపోతూ హుండీని కూడా ఎత్తుకు పోయారు. తెల్లారిన తర్వాత గుడికి వెళ్ళి చూస్తే ఏముంది!. ఆలయమంతా అస్త వ్యస్తం..వెండికిరీటాలు, డబ్బు మాయం. మొత్తంగా దాదాపు రెండు లక్షల రూపాయలు విలువచేసే నగలు దొంగలపాలయ్యాయి. గ్రామస్తులు లబోదిబో మంటూ ఈ చోరీ విషయాన్ని రూరల్ పోలీసులకు తెలియజేశారు.





## గ్రామశక్తి ఆలయంలోనూ చోరీ

లేబూరు కుంకాళమ్మ అంటే ఎంతో మహిమాన్వితమైన దేవతగా, మహ శక్తి స్వరూపిణిగా జిల్లాలో పురాతనం కాలం నుంచీ ప్రసిద్ధి. ఆ చుట్టుపక్కలున్న గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ అమ్మవారికి వేల సంఖ్యలో భక్తులున్నారు. అంతటి చరిత్రకలిగిన ఆలయంలో కూడా దొంగలు ప్రవేశించి నిర్భీతిగా దొంగతనానికి పాల్పడ్డారంటే ఏమనుకోవాలి?..ఇందుకూరుపేట మండలంలో ఉన్న లేబూరు కుంకాళమ్మ దేవాలయంలో చోరీ జరగడం గ్రామస్తుల్లోనే కాదు, జిల్లావ్యాప్తంగా భక్తులకు ఆందోళన కలిగిస్తోంది. ఈనెల 10న దొంగలు ఆలయం తలుపులు పగలగొట్టి లోపలికి వెళ్లి అందినకాడికి డబ్బు, నగలు దోచుకుపోయారు. హుండీలో ఉన్న దాదాపు లక్ష రూపాయలు కాజేశారు. అంతేకాదు, సుమారు 40వేల రూపాయల విలువచేసే అమ్మవారి బంగారు వస్తువులు కూడా అపహరించారు. దీంతో గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. దొంగలు మారుమూల గ్రామాలను కూడా ఎంచుకుని, ఎక్కడ దొంగతనాలకు వీలుంటుందో గమనించి మరీ ఆలయాల్లో చోరీలకు పాల్పడు తున్నట్లుంది. దొంగతనాలు జరుగుతున్నాయే తప్ప ఎక్కడా దొంగలు పట్టుబడడం లేదు. ఆలయాలకు సరైన రక్షణ ఉండడం లేదు. కేసులు నమోదవుతున్నాయే కానీ, దొంగల పోబిడీ తెలియడం లేదు. పోలీసులు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటుచేసి గట్టి చర్యలు తీసుకుంటే తప్ప, ఆలయాలకు భద్రత ఉండదు.

# సోమశిల గేట్లకు మరమ్మతులు చేయించాలి

జిల్లాలోని సోమశిల డ్యాం నుండి కండలేరు జలాశయానికి నీరు విడుదల చేసే కుడి హెడ్‌రెగ్యులేటర్ సరిగ్గా పనిచేయడం లేదని, నీటిని విడుదల చేసే సమయంలో, నిలుపుదల చేసేటప్పుడు గేట్లు మొరాయిస్తున్నాయని, జిల్లాకలెక్టర్ హరినారాయణన్ వెంటనే వాటిని పరిశీలించి డ్యామ్ గేట్లకు మరమ్మతులు చేయించాలని బీజేపీ నాయకుడు, నమామిగంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. సోమశిల ఉత్తర కాలువ గేట్‌లో కూడా లీకేజీ ఏర్పడిందని, వాటని పరిశీలించి బాగుచేయించాలని కోరారు.

# టూకీగా...



## ఆత్మకూరులో కల్యాణమండపానికి భూమిపూజ

ఆత్మకూరులో వెలసివున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ అలఘ నాథస్వామి దేవస్థానంలో స్వామివారికి కల్యాణ మండపం నిర్మించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఈనెల 10న భూమి పూజ చేశారు. బీజేపీ నాయకులు కుడుముల సుధాకర్‌రెడ్డి, నిత్యాన్నదాత కంచి పరమేశ్వరరెడ్డితో పాటు పెద్దసంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

## వింజమూరులో ఉపాధ్యాయులకు ఏపీటీఎఫ్ సన్మానాలు

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను పొందిన పలువురు ఉపాధ్యాయులను ఈనెల 10న వింజమూరులో ఏపీటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సమాఖ్య) జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ముఖ్య అతిథి పి.కొండారెడ్డి ఆధ్వర్యంలో అభినందించి సన్మానించారు.

## విడవలూరులో ఉచిత కంటివైద్య శిబిరం

విడవలూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 'మన సేవా సంస్థ' వ్యవస్థాపకుడు దేవళ్ల యానాదిరెడ్డి జ్ఞాపకార్థం నిర్వాహకులు దేవళ్ళ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 10న కంటివైద్య శిబిరం నిర్వహించి సుమారు 170 మందికి ఉచితంగా కంటిపరీక్షలు చేసి, తగు సూచనలిచ్చారు. మోడరన్ ఐ ఆసుపత్రి వైద్యులు విష్ణుతేజ, టెక్నీషియన్లు పాల్గొన్నారు.

## కురిచెర్లపాడులో కిడ్నీ బాధితునికి రూ.50 వేల సాయం

వెంకటాచలం మండలంలోని కురిచెర్లపాడు గ్రామంలోని వీవర్స్‌కాలనీలో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న నేతకార్మికుడు కె.ఆనందరావుకు ఈనెల 10న ఆలిండియా వీవర్స్ అసోసియేషన్ నాయకులు తమవంతు చేయూతగా 50వేల రూపాయలతో పాటు రెండు బియ్యం బస్తాలను కూడా బాధితునికి అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.

## కోవూరులో శ్రీ వీరాంజనేయునికి పవిత్రోత్సవాలు

కోవూరులోని శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామి వారికి ఈనెల 10న ప్రత్యేక పూజలు చేసి అత్యంత వైభవంగా పవిత్రోత్సవాలు నిర్వహించారు. అనంతరం పూలంగిసేవ, పల్లకిసేవ జరిగాయి. సింగంశెట్టి రమేష్, హరికిషన్‌బాబు, భరత్‌రెడ్డి, శ్రీనివాసులు, నాగరాజు, వేణు వారి కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## కాళయకాగొల్లులో వివాహిత అదృశ్యం

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కాళయకాగొల్లు గ్రామానికి చెందిన హేమలత (25) ఈనెల 9వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆమె భర్త అనిల్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అత్త తిడుతోందని మనస్తాపానికి గురై ఇంట్లోంచి వెళ్లిపోయినట్లు భావిస్తున్నారు. బుచ్చి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పుల్లనీళ్ళపల్లిలో ధ్యానంపై అవగాహన

చేజర్ల మండలం పుల్లనీళ్లపల్లిలోని శ్రీ వెంకయ్యస్వామి మందిరంలో ఈనెల 10న సింగరాయకొండకు చెందిన ప్రముఖ ధ్యాన మాస్టర్ నరసారెడ్డి ప్రజలకు ధ్యానంపై అవగాహన కలిగించారు. ధ్యానం వల్ల ఎన్నో ఉపయోగాలున్నాయని, ధ్యానంతో జ్ఞానం కలుగుతుందని చెప్పారు. ఆత్మకూరు ధ్యాన కేంద్రం సభ్యుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## మర్రిపల్లిలో కోలాహలంగా అంకమ్మ జాతర

పొదలకూరు మండలంలోని మర్రిపల్లిలో ఈనెల 9వ తేది రాత్రి అంకమ్మ జాతర కోలాహలంగా జరిగింది. అయిదేళ్ళ కొకసారి వచ్చే ఈ జాతరకు పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి వేడుకగా గ్రామోత్సవం, అగ్నిగుండ ప్రవేశం తదితర కార్యక్రమాలను నిర్వాహకులు అంగరంగవైభవంగా నిర్వహించారు.

## యల్లాయపాళెంలో సంఘబంధం మహిళలకు శిక్షణ

కొడవలూరు మండలంలోని యల్లాయపాళెంలో ఈనెల 10న సంఘబంధం మహిళలకు ఆర్‌పి మెహమ్మ ఆధ్వర్యంలో పోషకాహారం ప్రాధాన్యతపై శిక్షణ ఇచ్చారు. పెరటితోటలు పెంచుకోవడం ద్వారా పోషక విలువలున్న ఆకుకూరలను పొందవచ్చని సూచించారు. ఆర్‌పి శ్రీలక్ష్మి, శ్రీదేవి, వివిఓలు తాజ్, సుజని, నీరజ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ వైభవం...!



దొడ్ల డెయిరీ సిఈఓ, బీవీకే రెడ్డిగా నెల్లూరీయులకి సుపరిచితులు బుసిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి - శ్రీమతి మాధవిల కుమార్తె **మహిత - రిత్విక్** (డాక్టర్ మండల స్వరూప్‌రెడ్డి - రమల కుమారుడు )ల పెళ్లి ఆగస్టు 31వ తేదీ హైదరాబాదులో వైభోగంగా జరిగింది. కొత్త జంటకి 'లాయర్' శుభాశీస్సులు.



ధర్మభొట్ల రామమోహన్ - మాధవి ప్రియదర్శిని ల కుమారుడు **వెంకటసాయి అనీష్ - అపూర్వ**ల వివాహం సెప్టెంబర్ 6వ తేదీ నెల్లూరులో జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభ దీవెనెలు.



సైదాపురం వాస్తవ్యులు, మాజీ మండలాధ్యక్షులు, జెసిఎస్ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ - మాధవిల కుమారుడు **సిద్దేశ్ - పూజిత** (పడారుపల్లి వాస్తవ్యులు బూడిద మురళీ - కవితల కుమార్తె)ల కల్యాణం సెప్టెంబర్ 6వ తేదీ గూడూరులో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# స్కిల్ స్కామ్ నేరం - నారాకి కారాగారం

(మొదటి పేజీ తరువాయి)



బాబుతో 'ములాఖత్' అనంతరం విలేకర్లతో మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్, లోకేష్, బాలయ్య

న్యాయమూర్తి జ్యుడిషియల్ రిమాండ్ విధించే వరకు ఉత్కంఠ భరితమైన నాటకీయ పరిణామాలతో రాష్ట్ర రాజకీయం వేడెక్కింది.

ఈ కేసులో నిజానిజాలేమిటి...? చంద్రబాబు ఎన్ని రోజులు జైల్లో ఉంటారు..?? ఇప్పట్లో బెయిలు వస్తుందా.. రాదా..??? అన్న ప్రశ్నలకి కాలమే సమాధానం చెప్తుంది. బాబుని ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందో తన మంత్రివర్గ సభ్యుల చేత, ప్రభుత్వ ప్రధాన సలహాదారు చేత విడమర్చి చెప్పించడంలో వైసీపీ ప్రభుత్వం అత్యంత చాకచక్యంగా వ్యవహరించిందనడంలో ఎలాంటి సందేహం లేదు. నిజంగానే మా బాబు ఈ స్కామ్ చేశాడేమో..? అని తెలుగు తమ్ముళ్లకు సైతం సందేహం వచ్చేలా స్కామ్ వివరాలను అరటిపండు వలిచి పెట్టినట్లుగా వైసీపీ మంత్రులు వివరించారు.

ప్రధాన ప్రతిపక్ష నాయకుడు, అదీ ఒక మాజీ ముఖ్యమంత్రిని అరెస్టు చేసినప్పుడు విమర్శ, ప్రతివిమర్శల స్థాయి తీవ్రంగా ఉంటాయనడంలో అనుమానం లేదు. అందులోనూ... కొడాలి నాని, అంబటి రాంబాబు, రోజా, విడదల రజని లాంటివాళ్ళు అధికార పార్టీలో ఉంటే... బోండా ఉమా, దేవినేని ఉమా, దూళిపాళ్ల నరేంద్ర, ఆనం వెంకటరమణారెడ్డి లాంటివాళ్ళు చాలామంది ప్రతిపక్షంలో ఉన్నారు. కాబట్టి, మాటల యుద్ధం శృతిమించడం అన్నది ఊహించిందే.

మీడియా దిగ్గజం రామోజీరావుని లక్ష్యంగా చేసుకుని మార్గదర్శిపై దాడులు చేయించడం, చంద్రబాబుని జైల్లో పెట్టించడం వంటి అంశాలు కొన్ని వర్గాలలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చరిష్మాని బాగా పెంచాయి. బాబు అరెస్టు కావడంతోనే అదేదో మహేష్‌బాబు సినిమాలో డైలాగు చెప్పినట్లుగా 'బుల్లెట్టు దిగింది' అని కొన్ని రాజకీయవర్గాలు కామెంట్ చేస్తే, అదే మహేష్‌బాబు గురించి మరో నటుడు అన్నట్లుగా 'జగన్ మగాడ్రా బుజ్జీ' అని వైసీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నాయి.

### చకచకా మారుతున్న రాజకీయ పరిణామాలు...!

బాబు అరెస్టు వెనుక బీజేపీ ఉందా...? లేకపోతే అరెస్టు చేశాక కేంద్రానికి తెలిపారా...?? ఈ విషయంలో కమలదళం పాత్ర ఏమిటి...??? ఇవన్నీ చర్చించుకోవడానికి పనికొచ్చే ప్రశ్నలే తప్ప, అంత ఈజీగా సమాధానాలు దొరకవు. నిజంగా ఇదంతా బీజేపీ కనుసైగలలోనే జరుగుతుంటే, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఆంధ్ర బీజేపీ వ్యవహారాలు చూస్తున్న బండి సంజయ్ కూడా బాబు అరెస్టుని రాజకీయ కుట్రగానే అభివర్ణించేవారు కాదు.

ఇక బీజేపీతో దోస్తీతో ఉన్న జనసేనాని పవన్ కళ్యాణ్ గురువారం రాజమండ్రి జైలుకి వెళ్లి చంద్రబాబుని కలిశారు. రాబోయే ఎన్నికలలో జనసేన-టీడీపీ కలిసే పోటీచేస్తాయని అధికారికంగా ప్రకటించారు. కేంద్ర కమల దళం నాయకుల అనుమతి ఆశీస్సులు లేకుండానే పవన్ ఈ ప్రకటన చేసుంటాడని రాజకీయ విశ్లేషకులు భావించడంలేదు. మరోవైపు బాబు అరెస్టు అయ్యినప్పటి నుండి బాలయ్య రంగంలోకి దిగారు. పార్టీ కార్యాలయానికి వచ్చి బావ కుర్చీలో కూర్చుని పార్టీకి, కార్యకర్తలకి అండగా నేనున్నా అంటూ భరోసా కల్పించారు. తెలుగుదేశం ఎప్పటికైనా నందమూరి వారి పార్టీయే తప్ప, నారా వారి సొత్తు కాదని చెప్పకనే చెప్పారు.

### మారుతున్న సమీకరణలు - నేతల ఢిల్లీ ప్రయాణాలు

ఇప్పుడు సమీకరణలన్నీ మారుతున్నాయి. రాజకీయమంతా ఢిల్లీ చుట్టూ తిరుగుతోంది. మోడీ, అమిత్‌షా మనసుల్లో ఏముందో ఎవరికీ తెలియదు. జగన్ ఢిల్లీ ప్రయాణ ప్రయత్నంలో ఉన్నారు. బహిరంగంగా భాజపాతో జగన్ కలిసే ప్రసక్తే లేదన్నది జగమెరిగిన సత్యం. ఇతర పార్టీల నాయకులు కూడా ఢిల్లీకి ప్రయాణమవుతున్నారు. సందట్లో సడేమియాగా రేపోమాపో షర్మిల కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోబోతోందని వార్తలు వస్తున్నాయి. జనసేన - బీజేపీ దోస్తీ కొనసాగుతున్న తరుణంలో తాము టీడీపీతో కలిసి పోటీ చేస్తామన్న పవన్ ప్రకటన ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంటోంది. మొత్తానికి బాబు అరెస్టుతో రాష్ట్ర రాజకీయాలలో ఒక పెద్ద కుదుపు ఏర్పడింది.

ఆంధ్ర రాష్ట్ర రాజకీయం... బాబు అరెస్ట్‌కు ముందు, బాబు అరెస్ట్‌కు తరువాత అన్నట్లుగా విశ్లేషించవచ్చంటున్నాయి రాజకీయ వర్గాలు...!

# బాబు తప్పులేదని తెలిస్తే... చెంపలేసుకుంటారా?

## - వైసీపీ నాయకులకు మాజీమంత్రి సోమిరెడ్డి సవాల్

మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌పై మాజీమంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేని ఆ కేసులో చంద్రబాబును ఇరికించి అక్రమంగా జైల్లో పెట్టారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమండ్రిలో ఉన్న టిడిపి ప్రధాన కార్యదర్శి లోకేశ్‌ను ఆయన ఈనెల 13న పరామర్శించి, అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 'స్కిల్' కుంభకోణం పేరుతో చంద్రబాబునాయుడుపై వైకాపా నాయకులు కుట్ర పన్నారని, వైకాపా వారి పాపాలు పండేరోజులు దగ్గర్లోనే ఉన్నాయని, వైకాపాలోని ప్రతిఒక్కరూ ఆ పాపఫలితం అనుభవించక తప్పదని శాపనార్థాలు పెట్టారు. చంద్రబాబుకున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక



తప్పుడుకేసులు బనాయించి అక్రమంగా అరెస్ట్ చేశారని దుయ్యబట్టారు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో, తప్పుడు కేసులతో చంద్రబాబును జైలుకు పంపిస్తే తెలుగుదేశం పార్టీ బలహీనపడుతుందని వైకాపా అనుకుంటున్నదన్నారు. చంద్రబాబు అవినీతి చేసినట్లు ఒక్క ఆధారం కూడా లేదని, ఒక్క రూపాయైనా చంద్రబాబుకు ముట్టిందనే ఎలాంటి ఆధారాలు లేకుండానే చంద్రబాబును స్కిల్ కుంభకోణం పేరుతో అరెస్ట్ చేయడం దారుణమన్నారు. అవినీతి జరిగిందని రుజువుచేస్తే తాము దేనికైనా సిద్ధమని, అలా నిరూపించలేకపోతే మీరు చెంపదెబ్బలు వేసుకుని ప్రజల ముందు క్షమాపణలు చెప్తారా?. అంటూ వైకాపా నాయకులకు ఆయన సవాల్ విసిరారు.

2019లో జగన్ సిఎం అయ్యాక, స్కిల్ డెవలప్‌మెంట్‌లో ఏపీ దేశంలోకెల్లా నెంబర్ వన్‌గా నిలిచిందంటూ ప్రకటించారని, ఆ అభివృద్ధి అంతా చంద్రబాబు హయాంలోనే జరిగిందని అన్నారు. 2.13 లక్షల మందికి నైపుణ్య శిక్షణ ఇచ్చారని సుమారు 75 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయని వివరించారు. 'చంద్రబాబు ఇడుపులపాయలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను అభివృద్ధి చేశారో లేదో.. రండి చూపిస్తాం'.. అని ఆయన అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు అవసరమైన సామగ్రిని గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల కంటే తక్కువ ధరకు తీసుకు రావడమే చంద్రబాబు చేసిన తప్పా?..అని ఆయన ప్రశ్నించారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా మోడీ ఉన్న సమయంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును అక్కడ అమలుచేశారని, ఆ ప్రాజెక్టు నిర్వహించిన సీమెన్స్ కంపెనీతో పాటు డిజైన్ టెక్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కలసి రాష్ట్రంలోని విద్యార్థులకు నైపుణ్యశిక్షణ కోసం ట్రైపార్టీ ఒప్పందం కుదుర్చుకున్నాయని ఆయన వివరించారు.

# లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

## ○ 19,468 కేసులు పరిష్కారం



జాతీయ లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం జరుగుతోంది. సమన్యాయం అందుబాటులోకి వస్తోంది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి యామిని పర్యవేక్షణలో ఇటీవల ఉమ్మడి నెల్లూరుజిల్లాలో గత శనివారం ఒక్కరోజులోనే జాతీయ లోక్ అదాలత్‌లో 19468 కేసులను పరిష్కరించడం విశేషం. జాతీయ, రాష్ట్ర న్యాయాధికార సంస్థల సూచనల మేరకు నెల్లూరులో జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా భవన్‌లో మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కపర్ధి లోక్అదాలత్‌ను ప్రారంభించి ఆ సంస్థ విశిష్టతలను తెలియజేశారు. కక్షిదారులు రాజీపడి వస్తే లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరిస్తారని, కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయాన్ని, ధనాన్ని వృధా చేసుకోకుండా కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. రాజీ అయ్యే కేసుల్లో సుహృద్భావ వాతావరణంలో రాజీపడడమే ఇరుపక్షాలకు శ్రేయస్కరమని సూచించారు. కేసుల పరిష్కారం కోసం నెల్లూరులో 6 బెంచ్‌లు ఏర్పాటుచేయగా, న్యాయమూర్తులు కపర్ధి, కె.వాణి, పి.భరధ్వాజ, ఎన్.లావణ్య, జి.దేవిక, పి.వినోద్‌లు ప్రిసైడింగ్ అధికారులుగా వ్యవహరించారు. నగర పరిధిలో 7,150 కేసులు పరిష్కరించారు. నెల్లూరుతో పాటు గూడూరు, కోట, కావలి, వెంకటగిరి, కోవూరు, నాయుడుపేట, సూళ్ళూరుపేట, ఆత్మకూరు, ఉదయగిరిలలో మొత్తం 19,468 కేసులు పరిష్కరించారు. వీటిలో సివిల్, క్రిమినల్ కేసులతో పాటు, మోటారు వాహనాల ప్రమాదాల కేసులు, కుటుంబ వివాదాలు వగైరాలున్నాయి. కేసుల పరిష్కారం ద్వారా 1,14,43,556 రూపాయల పరిహారాన్ని కక్షిదారులకు అందజేశారు. లోక్ అదాలత్ కేసుల పరిష్కారంలో రాష్ట్రంలోనే జిల్లా ద్వితీయ స్థానంలో నిలవడం మరో విశేషం.




# ఉపాధ్యాయులపై వత్తిడి పెంచొద్దు

## యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు చెప్తూ పనిభారం పెంచి వత్తిడికి గురిచేయొద్దని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఇటీవల నెల్లూరులోని యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉపాధ్యాయులను మనస్తాపానికి గురిచేయడం మంచిది కాదన్నారు. శిక్షణల పేరుతో ఇతరత్రా పనుల సాకుతో పనిదినాలు హరించి, ఆ తర్వాత సిలబస్ త్వరగా పూర్తిచేయాల్సిందేనని ఆదేశించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యా సంస్కరణల వల్ల విద్యావ్యవస్థ అస్తవ్యస్తమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యదర్శులు నవకోటేశ్వరరావు, టి.రఘుపతిరెడ్డి, ఎస్ఎస్ నాయుడు, హనుమంతరావు, శ్రీదేవి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శేషులు, చలపతిశర్మ తదితరులు పాల్గొన్నారు.

# 'రూల్ అఫ్ లా'ను మనం గుర్తు చేసుకుందామా?

'రూల్ అఫ్ లా' అని ప్రతి సమాజంలోనూ ఒకటి ఉంటుంది. అది ప్రజాస్వామిక వ్యవస్థ అయినా, రాచరిక వ్యవస్థ అయినా, నియంతృత్వ వ్యవస్థ అయినా... మయన్మార్ లాగా అడ్డగోలు మిలిటరీ వ్యవస్థ అయినా అక్కడి సమాజానికి 'రూల్ అఫ్ లా' అంటూ ఒకటి ఉంటుంది. అడవుల్లో జీవించే జంతువులకే 'రూల్ అఫ్ లా' ఉండదు. అసలు 'లా' అనేదే ఉండదు కనుక.

మనుషులు నివసించే సమాజంలో... ఆ సమాజంలోని 'రూల్ అఫ్ లా'ను పాటించి తీరాలి. ఈ నిభందనలు, చట్టాలు... ఒక్కో సమాజానికి ఒక్కో విధంగా ఉండవచ్చు.

నిజానికి, ఏ సమాజంలో అయినా 99శాతం మంది పౌరులు ఎవరూ చెప్పకుండానే 'రూల్ అఫ్ లా'ను పాటిస్తారు. 'రూల్ అఫ్ లా' అనేది ఒకటి ఉంటుందని తెలియకుండానే పాటిస్తూ ఉంటారు. సింపుల్‌గా చెప్పుకోవాలి అంటే, ఎవరి బతుకు వారు ఎదుటి వారికి ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా బతకడమే.. 'రూల్ అఫ్ లా'. 99 శాతం మంది ప్రజలు ఏ సమాజంలో అయినా ఇలాగే బతుకుతూ ఉంటారు. ఎటొచ్చీ ఆ ఒక్క శాతంతోనే... ఏ పౌర సమాజానికైనా ఇబ్బంది కలుగుతుంది.

గణాంకాలుగా చూసి, ఒక్క శాతమేగా అని తేలికగా తీసుకునే ప్రమాదం లేకపోలేదు.

మాట వరుసకు ఆంధ్రప్రదేశ్ జనాభా సుమారు అయిదు కోట్ల ముప్ఫయ్ లక్షలు.

ఇందులో 99 శాతం మంది – అంటే... అయిదు కోట్ల ఇరవైనాలుగు లక్షల డెబ్బయ్ వేల మంది పౌరులు తు. చ. తప్పకుండ 'రూల్ అఫ్ లా'ను పాటిస్తున్నారు అనుకుందాం.

ఇక, మిగిలిన ఒక్క శాతం మంది – అంటే... అయిదు లక్షల ముప్ఫయ్ వేల మంది మాత్రమే 'రూల్ అఫ్ లా'ను అసలు ఖాతరు చేయడం లేదని... వాదన కోసం అనుకుందాం.

వీరు కారణాలు ఏమైనప్పటికీ పౌర సమాజంపై హత్యలు, దౌర్జన్యాలు, దోపిడీలు, మానభంగాలు, ఫోర్జరీలు, చీటింగ్‌లు, కబ్జాలు, గృహ దహనాలు, శిరో ముండనాలు వంటి చెప్పలేనన్ని అకృత్యాలకు తెగబడితే....?!

ఈ ఒక్క శాతం 'రూల్ అఫ్ లా' ఉల్లంఘనుల చేతుల్లో... 99 శాతం చట్టబద్ద జీవనం సాగించే పౌర సమాజం పరిస్థితి ఏమిటి?

ఒక్క శాతం కాదు గదా... ఆ ఒక్క శాతంలో ఒక్క శాతం మంది 'రూల్ అఫ్ లా' ఉల్లంఘనలకు తెగబడినా.. 99.99 శాతం పౌర సమాజం తట్టుకోలేదు.

దీనికీ, రాజకీయాలకూ సంబంధం లేదు. రాజకీయాలు అనేవి రాజకీయ పార్టీలకు సంబంధించిన అంశం. ఏమి చెప్పి... అధికారంలోకి వద్దామా అని అవి ఆలోచిస్తుంటాయి.

'రూల్ అఫ్ లా'ను పాటించడం అనేది పౌర సమాజానికి సంబంధించిన అంశం. ఏ పార్టీ అధికారంలో ఉంది అనే అంశంతో పెద్ద సంబంధం ఏమీ లేకుండానే ఈ 'రూల్ అఫ్ లా' ఉల్లంఘనులు... పౌర సమాజాన్ని ఈతి బాధలకు గురిచేస్తూ ఉంటారు.

ఒక్కొక్క దేశంలో ఒక్కొక్క రీతిగా ఈ ఉల్లంఘనులతో వ్యవహరిస్తారు. ఉదాహరణకు చైనాలో అయితే.... సింపుల్‌గా వీరిని ఉరి తీస్తారు. సౌదీ అరేబియాలో అయితే, బహిరంగంగా కొరడాలతో కొట్టి జైళ్ళలో పారేస్తారు. రష్యాలోనూ జైళ్ళలో కుక్కుతారు. అమెరికాలో అయితే.... అత్యంత కఠిన జైలు శిక్షలు విధిస్తారు.

ఉదాహరణకు అమెరికా అధ్యక్షుడుగా 2020లో జో బైడెన్ గెలుపును ధృవీకరించడానికి సమావేశమవుతున్న అమెరికన్ కాంగ్రెస్ భవనం(మన భాషలో పార్లమెంట్ భవనం) పైకి దండెత్తిన ట్రంప్ అనుయాయులలో నేరం రుజువైన వారికి వరసబెట్టి 15,16,17,18 ఏళ్ళ జైలు శిక్షలు విధించేశారు. మన దేశంలో మర్డర్‌లు చేసిన వారికి కూడా అంతంత శిక్షలు పడవు. పాకిస్తాన్‌లో కూడా మిలిటరీ కోర్టులు ఉరి తీస్తున్నాయి. వారిపట్ల చట్టబద్ద వ్యవస్థలు అంత కఠినంగా వ్యవహరించకపోతే, సమాజాలు గౌరవప్రదంగా, ప్రశాంతంగా, శాంతియుతంగా జీవించలేవు.

'రూల్ అఫ్ లా' ఉల్లంఘనులకు కులం లేదు,






మతం లేదు, ప్రాంతం లేదు, రాజకీయ అభిమాన... దురభిమానం లేదు. సమాజాన్ని నంజుకు తినడమే... వారికి కులమైనా, మతమైనా, ప్రాంతమైనా, రాజకీయమైనా. వీరు ఉండాల్సింది... నిజానికి పౌర సమాజంలో కాదు. జైళ్ళల్లో.

మరి, మన సమాజ జీవనం... అటువంటి ఉల్లంఘనుల ఫలితంగా ఎంతగా కలుషితం అయిపోతుందో ఆలోచించవలసిన వారు, చర్యలు తీసుకునే బాధ్యత, అధికారం కలిగిన వారు ఉదాసీనంగా ఉంటున్నారు.

ఫలితంగా పౌర సమాజాన్ని నంజుకుతినే వారి సంఖ్య ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోతోంది. పౌర సమాజం వారి చేతుల్లో ఎంతగా నలిగి, చితికి చిన్నాభిన్నం అయిపోతుందో రోజువారీ దిన పత్రికల జిల్లా ఎడిషన్లు చూస్తే తెలుస్తుంది. వారి అరాచకాలను పౌర సమాజం నిస్సహాయంగా చూస్తుండి పోవలసి వస్తుంది.

రాజకీయ వ్యవస్థలు వారిని పల్లెత్తు మాట అనవు. వారి నుంచి పౌర సమాజాన్ని కాపాడాల్సిన వ్యవస్థలు.... ఆ పని చేయడం లేదనే అభిప్రాయం సమాజంలో గట్టిగా పాతుకుపోతోంది.

ఈ 'భీతావహ' పరిస్థితుల్లో పౌర సమాజపు నడక పరిస్థితి ఏమిటి? భవిష్యత్ తరాల పరిస్థితి ఏమిటి? మరో తరం గడిస్తే మన సమాజానికి... ఆటవిక సమాజానికి తేడా ఏమిటి?

మన తరువాతి తరాల పిల్లలు సగౌరవంగా... ఆత్మాభిమానంతో జీవించే అవకాశం ఉంటుందా?

"నిజమే! చట్టబద్ద జీవనం పట్ల నిబద్ధత కలిగిన పౌరులందరూ ఆలోచించాల్సిన 'పైకి సమస్యలాగా కనపడని పెను సమస్య' ఇది. రాజకీయ రాగద్వేషాలతో సంబంధం లేకుండా... ఉల్లంఘనులను రాజకీయాలనుంచి వేరు చేయడానికి ప్రజలే కృషి చేయాలని కూడా విజ్ఞుల భావన.

### ప్రవాసాంధ్రులపైనే భారం...!

అమెరికాతో సహా పలు దేశాలలో ప్రవాసాంధ్రులు తెలుగు కీర్తిపతాకను ఎగురవేస్తున్నారు. ఒక్క అమెరికాలోనే పది లక్షల మంది తెలుగువారు ఉన్నట్టు ఓ అంచనా.

వారు... ఇక్కడ మన రాష్ట్రంలోనే పుట్టారు. ఇక్కడే పెరిగారు. వీధి బళ్ళల్లో చదువుకున్నారు. బురదలోంచి పుట్టి, నవనవోన్మేషంగాపెరిగిన పద్మాల్లా... ఇప్పుడు అమెరికా, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా తదితర సుదూర ప్రాంతాలలో వైద్యులుగా, పారిశ్రామికవేత్తలుగా, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌గా, పలు రకాల వృత్తుల్లో తెలుగు వెలుగులు విరజిమ్ముతున్నారు. వారు ఒక 'సమానావకాశాల' స్వేచ్ఛా సమాజంలో సగౌరవంగా జీవిస్తున్నారు.

అయినప్పటికీ, పుట్టి, పెరిగిన నేలతల్లిని మరిచిపోకుండా.... విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఇతర సేవా కార్యక్రమాలకు లక్షలు, కోట్ల రూపాయలు తృణప్రాయంగా ఖర్చు చేస్తున్నారు. అవకాశం ఉన్నప్పుడల్లా స్వరాష్ట్రంలో పర్యటిస్తున్నారు. పైపెచ్చు తమ తమ అసోసియేషన్లు తమ తమ నివాస దేశాల్లో జరుపుకునే వార్షిక సదస్సులకు తెలుగునాట ప్రసిద్ధులైన రాజకీయ, సినీ, సాంస్కృతిక, సంగీత, నృత్య, గాయక కళాకారులను ఆహ్వానించి... సన్మానించి, మాతృభాష, మాతృభూమి పట్ల తమ మమకారాన్ని, అభిమానాన్ని విశేషంగా చాటుకుంటున్నారు.

అయితే, వీటితో పాటు తెలుగు సమాజంలో రోజురోజుకూ పేట్రేగిపోతున్న 'రూల్ అఫ్ లా' ఉల్లంఘనుల(యాంటి సోషల్ ఎలిమెంట్స్) కార్యకలాపాలను అధికార, రాజకీయ వ్యవస్థల దృష్టికి బలంగా... ఎప్పటికప్పుడు తీసుకురావలసిన ఆవశ్యకతను పరిగణనలోకి తీసుకోవాలి. జన సామాన్యంలో ఒక చైతన్యం కలిగించడానికి ఏమి చేయాలా అని కూడా ఆలోచించాలి. విదేశీ తెలుగు పెద్దలు తలుచుకుంటే... కాన్సర్ లాంటి ఈ సమస్యకు పరిష్కారం కనపడకపోదు.

- భోగాది వేంకట రాయుడు
శాన్ఫ్రాన్సిస్కో నుండి...
medhomadhanam@gmail.com

# శ్రద్ధాంజలి







అనురాగమూర్తి, ఆత్మీయదీప్తి
మా ఇంటి దీపం, మా పెద్ద దిక్కు

## శ్రీమతి పాలిచర్ల శారదమ్మ

(లేట్ జనార్దనరెడ్డి గారి సతీమణి)

సెప్టెంబర్ 4వ తేదీ, సోమవారం ఉదయం
దివంగతురాలయినారు.

స్నేహశీలి, ప్రతిభాశాలి
సేవాభిలాషి, అందరికీ శ్రేయోభిలాషి

## శ్రీ పాలిచర్ల శ్రీనివాసులురెడ్డి

(సర్పంచ్, మానేగుంటపాడు)

సెప్టెంబర్ 14వ తేదీ, గురువారం ఉదయం
పరమపదించారు.

**ఈ ఇద్దరు మానవతామూర్తుల ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...**

**పాలిచర్ల వెంకటప్రసన్నరెడ్డి - స్వర్ణలత**
**పాలిచర్ల సుదర్శన**
**టంగుటూరు నివేదిత - టంగుటూరు రాకేష్‌రెడ్డి**
**పాలిచర్ల శరణ్ త్రిశూల్‌రెడ్డి - పాలిచర్ల పూజిత**
**చర్లకోల రోషిణి - చర్లకోల స్వరణ్‌రెడ్డి**
**టంగుటూరు నిచ్చిత - పాలిచర్ల అనైక**

### ఉత్తరక్రియలు:

వారిద్దరి **పెద్దకర్మ సెప్టెంబర్ 28వ తేదీ,** గురువారం ఉదయం 11.00 గంటలకి, నెల్లూరుజిల్లా, కొడవలూరు మండలం, మానేగుంటపాడులోని మా స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకి తెలియచేయడమైనది.

**గమనిక :** సెప్టెంబర్ 16వ తేదీ, శనివారం జరగవలసిన కీ॥శే॥ పాలిచర్ల శారదమ్మ గారి పెద్దకర్మ కార్యక్రమం సెప్టెంబర్ 28వ తేదీకి మారినది. బంధుమిత్రులు గమనించ మనవి.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com